# శ్రీమాష్టరు చూపిన సాయి మార్గం

అష్టమ అఖిలాంధ్ర సాయిమాష్టర్ భక్త సమ్మేళనము – 2007



# శ్రీమాష్టరు చూపిన సాయి మార్గం



# శ్రీమాష్టరు చూపిన సాయి మార్గం

(అష్టమ అఖిలాంధ్ర సాయిమాష్టర్ భక్త సమ్మేళనము – **2007**)


కాపీలు **3000**

ప్రథమ ముద్రణ: ఫిబ్రవరి **2007**

వెల : అమూల్యం.

ప్రతులకు :
శ్రీ సాయి మాష్టర్ సేవా ట్రస్ట్
గొలగమూడి పోస్ట్.
(వయా) సర్వేపల్లి
నెల్లూరు జిల్లా ( ఏ.పి)
పిన్ : **524 321**

సమర్పణ :
శ్రీ సాయి మాష్టర్ సేవా ట్రస్ట్
గొలగమూడి పోస్ట్.
(వయా) సర్వేపల్లి
నెల్లూరు జిల్లా ( ఏ.పి)
పిన్ : **524 321**

**www.saimastersevatrust.org**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1 | ముందు మాట | 6 |
| 2 | సమ్మేళనము | 7 |
| 3 | జాతకాలు | 10 |
| 4 | ముహూర్త బలాలు | 13 |
| 5 | శ్రీ మాష్టరుగారి వడుగు | 14 |
| 6 | శ్రీ మాష్టరుగారి బోధలలో కొన్ని ముఖ్యమైనవి | 16 |
| 7 | నాగతేంటి? నా తప్పేమిటి? | 19 |
| 8 | పుణ్యం పాపాన్ని రద్దు చేస్తుందా? | 20 |
| 9 | ప్రేమమయుడు | 21 |
| 10 | శ్రీ భరద్వాజ మాష్టరుగారు ఒక్కరు చాలరా? | 22 |
| 11 | స్వప్న దర్శనం | 23 |
| 12 | జంధ్యం, గాయత్రీల లక్ష్యం | 24 |
| 13 | మానవ జాతికి ఆధారం | 24 |
| 14 | పిలవగానే పలికే పావన మూర్తి శ్రీ మాష్టరు గారు | 25 |
| 15 | పవిత్ర కోరిక తీర్చిన పావనమూర్తి | 26 |
| 16 | శ్రీమాష్టరు చూపిన సాయి మార్గం | 28 |
| 17 | సాయి తనకు చేసిన ఉపకారాలు | 34 |
| 18 | వారు చెప్పిందొకటి నేడు మనం చేసేదొకటి | 36 |
| 19 | సాయి మందిరం | 36 |
| 20 | నా శిష్యుడనేవాడెవరూ లేరు | 38 |
| 21 | అతిథులు, ఆత్మీయులు | 42 |
| 22 | శ్రీ మాష్టారి దివ్యబోధ | 43 |
| 23 | అమ్మగారితో సత్‌సంగం | 53 |




# ముందు మాట

ప్రియమైన సాయి బంధువులకు,

నమస్కారము

శ్రీ మాష్టారు సమ్మేళనము అనే పేరు లేకున్నా, విద్యానగర్‌లోను, ఒంగోలు సాయి మందిరం వచ్చినంత వరకు ప్రతి సంవత్సరము **1**. విజయ దశమి, **2**. గురు పూర్ణిమ, **3**. శ్రీరామ నవమి, **4**. దత్త జయంతి, **5**. శ్రీ మాష్టరు పుట్టిన రోజు పండుగలు జరిపేవారు.

"మీరందరూ అప్పుడప్పుడూ కలుస్తుండాలి. **1**. ఒకరి భావాలొకరు తెలుసుకుంటుండాలి, **2**. సాధనలోని ఇబ్బందులు మిత్రులతోను, నాతోను చర్చించి తీర్చుకోవాలని" చెప్పేవారు.

అందుకే నేడు సమ్మేళనాలనే పేరుతో కలుస్తున్నాము. శ్రీ మాష్టరుగారి రెండాశయములను, సమ్మేళనములో పాల్గొని ప్రతి ఒక్కరము నెరవేర్చేటట్లు చేయమని ప్రార్థిద్దాం.

ఈ చిన్న పుస్తకము మీ కందించిన శ్రీ మాష్టరుగారికి, అందుకు సహకరించిన మిత్రులందరికీ కృతజ్ఞతాభివందనములు.

శ్రీ పెసల సుబ్బరామయ్య.

# సమ్మేళనము

ప్రియమైన మిత్రులందరికీ,

నమస్కారములు.

మనందరినీ ఈ సమ్మేళనము అనే కార్యక్రమము ద్వారా ఒక చోట చేర్చి మనందరి ప్రవర్తనలు వేయి కళ్ళతో గమనిస్తూ మనలను ప్రతి ఒక్కరినీ మనము ఉన్న స్థాయి నుండి పైకి లాక్కోవాలనేదే శ్రీమాష్టరుగారి ఆశయము. అదెలాగు అంటారేమో?

సమ్మేళనము జరపడం ద్వారా ఒక నిష్కామకర్మ మన చేత చేయిస్తున్నారన్నమాట. నిష్కామకర్మ యొక్క ఆశయం ఏమిటి? మనలోని మలదోషాన్ని నిర్మూలించుకొనుట మాత్రమే. అంతేగానీ ఇంకొంచెము మలదోషం పెంచుకోమని కాదు. ( రాగ, ద్వేష, అసూయ భావముల చేరికే మలదోషం ) రాగద్వేషాలంటే ఇష్టము, అయిష్టములని అర్థం. ఎలా జరగాలో అలాగే జరుగుతుంది. రాగద్వేషాల స్పర్శలేకుండా చూస్తూ, మనలోపల జరిగే బొమ్మలాట అంటే వచ్చే భావ పరంపరలు గుర్తిస్తూ వివేక విచారాలతో నిర్మూలించుకుంటూ క్రొత్తవి చేరకుండా, పాత వాటిని నిర్మూలించుకునే పని చేయాలి. మనందరము శ్రీమాష్టరుగారి చేతిలోని కీలుబొమ్మలమని, పాయసం కాసేందుకు వాడే తెడ్డు లాంటి వారిమని, పాయసం చేసే నాథుడు శ్రీమాష్టరుగారని ఒక్క క్షణం ఏమారకుండా గుర్తు పెట్టుకొని నడుచు కోవాలి.

మన ఉపన్యాసాల వల్లనే ఇతరులు బాగుపడుతారా? మనం ఈ విశ్వంలో **1%** జనానికి మన ఉపన్యాసం వినిపించ గలుగుతున్నామా? లేనే లేదు. అడిగిన వారికి అడిగిన చోట సమాధానమిస్తున్న శ్రీమాష్టరుగారిని మరచి పోకూడదు. మనబోధ లెంత? మన కరపత్రాలెంతవరకు వారి పవిత్ర ఆశయాన్ని నెరవేరుస్తున్నాయి? వారి ఆశయమేమిటి? ఈ సమ్మేళనం అనే వంట ద్వారా (మందు ద్వారా) మన మలదోషం సాధ్యమైనంత తొలగించడం. శ్రీమాష్టరుగారి సర్వ సమర్థత్వం ఏమరుపాటు లేకుండా గుర్తిస్తుంటే మనకు క్రొత్త మలదోషాలు చేరకుండా పాతవాటిని సాధ్యమైనంత వరకు కడిగేసుకోవడానికి ప్రయత్నం చేద్దాం.



సమ్మేళనములో turn out చేసిన పని కాదు ముఖ్యం. "మనం ఎంత వరకు మలదోషం నిర్మూలించుకున్నాము, క్రొత్త మలాలు ఎంత వరకు చేరకుండా బయట పడ్డాము" అనేదే లెక్క. సమ్మేళన నిర్వహణలో హృదయ పూర్వకంగా పాలుపంచుకోకుండా విహారయాత్రగా చేసుకుంటే శ్రీమాష్టరుగారికి శ్రమ కలిగించిన వారమౌతాము.

శ్రోతలు కూడా చాలా జాగ్రత్తగా పాలుపంచుకొని భాగస్వాములు అయితేనే నిష్కామ కర్మ చేసిన వారు అవుతారు. లేకుంటే చివటం అమ్మగారు చెప్పినట్లు "నీకు రావడమైనా వచ్చిందంటే?" అన్నట్లు అవకూడదు. సమ్మేళనానికి ఎలా రావాలి? ఎలా ఉండాలి? ఎలా వెళ్ళాలి? అనేది ఎవరికి వారే తెలుసుకోవాలి. అలా కాకుంటే చివటం అమ్మ చెప్పింది అక్షర సత్యం అవుతుంది.

సమ్మేళనమంటే రెండు రోజులపాటు సహజీవనం చేయడం నేర్చుకోవడం అన్నమాట. ఈ కొద్ది మందిలో కొద్ది గంటలు సహజీవనం చేయలేని వాళ్ళము బ్రతికినంత కాలం ఇంత పెద్ద విశ్వంలో సంతోషముగా సహజీవనం ఎలా చేయగలమో యోచించండి?

వాళ్ళకంటే మనం సమ్మేళనం బాగా చేశామని అనుకోవాలి అనేది ధ్యేయం కాదు. మనం మన మలదోషం పోగొట్టుకొనే ప్రయత్నం ఎంత చేశాము. మలదోషం పోగొట్టుకునే అవకాశం ఎందరికి ఎంత వరకు ఇచ్చాము అనేదే మన ధ్యేయం కావాలి.

శ్రీమాష్టరుగారి సమ్మేళనాలు జరిపిన వారికి, వచ్చిన వారికి శ్రీమాష్టరుగారి ఆశయం ఎంత నెరవేర్చాము అనేది లెక్క. ఎంత ఖర్చు పెట్టుకున్నాము అనేది లెక్క కాదు.

శ్రీమాష్టరుగారు నేడు మన చర్మ చక్షువులకు కనిపించకున్నా అంతటా నిండిన చైతన్య రూపులై మనలను అనుక్షణము కనిపెడుతూనే ఉన్నారు. తగిన విధంగా అనుభవములిస్తున్నారు. కానీ మనం మాత్రం వారు బోధించిన దానిలో నూటికొక్కటి ఆచరించినా వారికి ఆనందం కల్గిస్తాము. భగవంతుడు మన దగ్గరకు పంపిన ప్రతి పైసాగానీ, వస్తువుగానీ జాగ్రత్తగా ఆయన సేవకు మాత్రమే వినియోగించండి. మన సుఖాలకు, భోగాలకు వాడరాదని బోధించారు.

ఉదాహరణలు ఎన్నైనా ఇవ్వవచ్చు. ఒక గ్రంథం అవుతుంది. నెల్లూరులో ఏవో పనులుండి చాలా చోట్ల తిరగ వలసి వస్తుందని శ్రీ D. జయచంద్రారెడ్డి గారిని

సెలవు పెట్టి రైల్వే స్టేషనుకు రమ్మన్నారు. జయచంద్రారెడ్డి రోజంతా తమతో ఉండేటట్లు ఒక ఆటో మాట్లాడి కాంట్రాక్టుకు కుదుర్చుకొని రైలు స్టేషనుకు తీసుకొచ్చారు. రైలు దిగిన శ్రీమాష్టరుగారిని ఆటో ఎక్కమంటే ఎక్కకుండా ఆటోవానికి పది రూపాయలిచ్చి పంపేసి రెడ్డిగారి లూనా మీద రోజంతా తిరిగారు. ఎందుకు ఆటోకు డబ్బు వృధా అవుతుంది. ఆ డబ్బు మరొక మంచి పనికి పనికొస్తుందని వారి భావన.

ఎన్నోమార్లు ఎక్స్‌ప్రెస్ రైల్లో పోదామంటే వద్దు పాసింజర్ టిక్కట్లే తెమ్మనేవారు. ఎక్స్‌ప్రెస్‌కు ఒక చార్జీ డబ్బు పాసింజరుకు రెండు చార్జీలకు వస్తుంది. ఈ విషయం ప్రతి విషయంలోను వర్తిస్తుంది.

నన్నొకసారి పది కిలోలు నక్క దోసకాయలని (సన్న దోసకాయలు) తెమ్మన్నారు. అది అమ్మగారు విని అవి ఎందుకని అడిగారు. తరిగి వరుగు పోసుకుంటే పులుసులో వేసుకోవచ్చు. అర్ధరూపాయ ఖర్చుతో ఐదు రూపాయల ఖర్చు తప్పుతుందన్నారు. ఇదంతా మనము నేర్చుకుంటే ఆర్థిక ఇబ్బందులే దరిచేరని జీవిత విధానమవుతుంది.

అయితే నేడు ప్రతివారమూ మన ప్రవర్తనను మనమే విమర్శించు కోవాలి. "నా దగ్గర డబ్బు ఉంది నేను ఖర్చు పెట్టుకుంటాను." అనేది సరైన పద్ధతేనా? మన ఖర్చులు ఆదాచేసి సాయి రూపాలైన నిరుపేదలకేమి చేస్తున్నామో యోచించాలి. ఏదో డబ్బు దానం చేయడం కాదు.

1. శ్రీమాష్టరుగారు చద్దన్నం తిని డాక్టరును పోషించారు.
2. రైలు చార్జీలు ఆదా చేసేందుకు పాసింజర్‌లో ప్రయాణం చేశారు.
3. ఇస్త్రీ లేని బట్టలు ధరించారు.
4. తానుగా లాడ్జీలలో విశ్రమించలేదు.

నేడు మనం పుణ్య క్షేత్రాలకెళ్ళినప్పుడు ఎంత ఖర్చయినా లాడ్జిలే కోరుతాము. చౌల్ట్రీ, ఉచిత లాడ్జీలకు అడుగు పెట్టము.

సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ మరచి పోతున్నాము.

ఈ సమ్మేళనాలలో ఏమి నేర్చుకున్నాము అనేది వదలి ఎంత గొప్పగా విమర్శించామని ఆనంద పడుతున్నాము. శ్రీమాష్టరుగారు మన ప్రవర్తనకు ఏవిధంగా సంబర పడుతారో తెలియదు.



# జాతకాలు

అనేక మంది భక్తులు ఎన్నాళ్ళనుండో మేము శ్రీ సాయి, శ్రీ స్వామి, శ్రీమాష్టరుగారు వంటి మహనీయులను పూజిస్తున్నాము. పారాయణ చేస్తున్నాము. మా బిడ్డలకు జాతకాలు చూపించి, మంచి మూహూర్తములోనే పెండ్లి చేశాము. కానీ ఈ మహనీయులు మాకు ఇన్ని కష్టాలు పెడుతున్నారెందుకో? అనే భక్తులు అనేకులున్నారు. ఈ ప్రశ్నకు సమాధానం మహనీయుల మాటలలోను, భక్తుల అనుభవాలలోను చూద్దాం.

P.R.K. ప్రసాద్ గారి భార్య అరవిందమ్మ గారి అనుభవం 'పిలిచిన పలికే దైవం' అనే పుస్తకంలో 3వ పేజీలో ఉంది. తన కొమార్తెకు వివాహం ఆలస్యమౌతుందని తన ఇంట్లో ఒక వారం 'ఓం నారాయణ ఆది నారాయణ' అనే నామస్మరణ రాత్రింబవళ్ళు వదలకుండా చేసింది. సప్తాహమయిన తరువాత రోజు శ్రీ స్వామి వారు స్వప్న దర్శనమిచ్చి "పెండ్లి కొమారుడే మొదట మీ యింటికి వస్తాడు. ఆయనకే ఇచ్చి వివాహం చేయమని" చెపుతాడు. కానీ జ్యోతిష్యం పిచ్చిగల అమ్మాయితండ్రి 'అమ్మాయి, అబ్బాయిల జాతకాలు ఎందరికి చూపించినా వీళ్ళిద్దరి జాతకాలు కుదరవు అని నిక్కచ్చిగా చెప్పారు. అలాంటప్పుడు శ్రీ స్వామివారు ఆ అబ్బాయికే ఇమ్మని ఎందుకు చెప్పాడు' అని ప్రశ్నిస్తే, ఆమె శ్రీ స్వామి వారు ఆవిధంగా స్వప్నాదేశమిచ్చి పెండ్లి జరిపించమన్నారని ఆమె భర్తతో గట్టిగా మాట్లాడి ఆ పెండ్లికొడుకుకే ఇచ్చి వివాహం చేసింది. ఇప్పటికి **8** సం॥లకు పైనైంది. ఇద్దరు మొగ పిల్లలు కలిగారు. భార్య భర్తలు అన్యోన్యంగా ఉన్నారు. జాతకాలు కుదరని పెండ్లి చేస్తే ఇలా ఉందేమిటి అని ఆశ్చర్యపోతున్నారు కదా! ఈ విషయంలో శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్య గారు (శ్రీ మాష్టారి అన్నగారు) అన్న మాటలు బాగా గుర్తించ దగియున్నాయి.

అందరి జాతక చక్రాలు సరిగ్గా ఉండేందుకు వీలు లేదు.

**1**. బిడ్డ జననం అనేది స్త్రీ పురుష జీవకణముల కలయిక జరిగిన కాలాన్ని బట్టి నిర్ణయిస్తామా?

**2**. బిడ్డతల తల్లి గర్భం నుండి బయటకు కన్పించిన కాలమా?

3. బిడ్డ పూర్తిగా తల్లి గర్భం నుండి బయటకు వచ్చిన కాలమా?

4. ఏ నాలుగు గడియారాలు టైం ఒకే విధంగా చూపించవు. ఒక్క నిమిషము కాదు ఒక్క సెకండు కాలంలో జాతక చక్ర ఫలితాలన్నీ మారి పోతాయి. సిద్ధాంతుల జాతక చక్రాలు నూటికి నూరు పాళ్ళు సత్ఫలితాలు ఇస్తాయని గ్యారంటీ లేదంటారు.

ఆచార్య శ్రీ భరద్వాజ గారు అవధూత లీల గ్రంథంలో " దేంతో పీకులాడే వారు దాంట్లోకే" అనే అధ్యాయంలో (**149**వ పేజీలో) అంటారు. "జ్యోతిష్యము, వ్యాకరణము మొదలగునవి అపరవిద్యలు. ఇవి బహిర్ముఖములు, ఐహికములు గనుక మోక్షమునకు ప్రధానము కావని, ఇవి మానవుని భ్రాంతిలో పడవేసి అధోగతి పాలు చేస్తాయని మన శాస్త్రాలు చెప్పాయి."

ఈ జాతకాలను గూర్చి సాయినాథులు ఏమిచెప్పారో చూద్దాం. గ్రహ బలం కూడా గురుని అనుగ్రహ బలానికి లోకువే. శ్రీమాన్ బూటీకి గండమున్నదని జ్యోతిష్కుడు చెప్పినప్పుడు సాయి "ఏమిటి నీకు గండమున్నదన్నాడా? అదేమి చేస్తుందో నేను చూస్తానని" ఆ గండం లేకుండా, పాము కన్పించకుండా ప్రక్కన వెళ్ళేలా చేసారు..

మేరికర్ ఉత్తరీయం క్రింద ఉన్న పాము బారి నుండి రక్షించడం, టెండూల్కర్ కుమారుని జాతకం బాగుండలేదని పరీక్ష పాసుకాదని జ్యోతిష్కులు చెపితే సాయి ఆ జాతక ఫలితం వానికి అంటకుండా పరీక్ష పాస్ చేయించడం. దామోదర్ రాస్నేకు సంతానం లేదని జ్యోతిష్కులు చెపితే సాయి అనుగ్రహంతో వారికి సంతానం కల్గడం.

ధ్యానయోగ సర్వస్వం అనే గ్రంథంలో **40** వ పే. అఖండానంద సరస్వతికి **19** వ సం॥లో మరణమున్నదని జ్యోతిష్కులు చెపితే వారి దివ్య



సాధన ద్వారా మృత్యువు వంటి అనుభవం కల్గి తర్వాత గొప్ప సిద్ధ పురుషుడయ్యాడు.

పర్నిప్రశ్న అనే గ్రంథంలో **18**వ పే. శ్రీ మాష్టరుగారు అంటారు " ఆటో రైటింగ్ అనేది భవిష్యత్తు, నిక్షేపాలు, శాంతులు గత జన్మలు మొ॥ తెలుసుకునే యత్నాలే. ఆటో రైటింగులు, శకునము, ప్రశ్న, జ్యోతిష్యము మొ॥ అన్నీ భగవంతునికి మాత్రమే తెలుసు. భగవంతుని శరణు పొందినవారిని ఆయనే తగు విధంగా నడిపిస్తాడు. అట్లాగాక వాటిని తెలుసుకొని మనకై మనమే ఆచరించాలను కోవడం ప్రేమ మయుడైన ఆ మహనీయుని జేబు కొట్టడమే అవుతుంది అంటారు శ్రీ మాష్టరు గారు.

ఇంతే గాక " ఒక యోగి ఆత్మ కథ" అనే గ్రంథములో యుక్తేశ్వర్ మహరాజు చెపుతారు

జ్యోతిష్యం మీద మూఢభక్తి మనిషిని, యాంత్రిక మార్గ దర్శకత్వం మీద గుడ్డిగా ఆధారపడే మర మనిషిగా తయారు చేస్తుంది. కానీ వివేక వంతుడు తన భక్తి ప్రపత్తులను సృష్టి మీద నుంచి సృష్టికర్త మీదకు మళ్ళించి తన గ్రహాలని ఓడిస్తాడు. అంటే తన గతాన్ని వమ్ము చేస్తాడు. పరమాత్మతో తనకు గల ఏకత్వాన్ని అతను ఎంత ఎక్కువగా గ్రహిస్తుంటే భౌతిక ప్రపంచం అతని మీద ప్రాబల్యం వహించడం అంతగా తగ్గుతూ ఉంటుంది." (ఒక యోగి ఆత్మ కథ పేజీ నెం. **213**) గనుక సద్గురు కృప పొందడమే వివేక వంతుని లక్ష్యం కావాలి. వివేక వంతుడు తన దృష్టి సృష్టి మీద కంటే సృష్టి కర్త మీదకు మళ్ళించాలి. సద్గురు కృపను పొందేవిధంగా నడుచుకోవాలంటారు.

# ముహూర్తబలాలు

ఎంతో విచిత్రమైన విషయమేమంటే భగవంతుని అవతారమైన శ్రీరామ చంద్రుని విషయంలో గూడా ముహూర్త బలం పనిచేయలేదు. పట్టాభిషేకానికి పెట్టిన ముహూర్తానికే అడవులకు వెళ్ళాడు. సీతాదేవిని

పెండ్లాడినపుడు ముహూర్తం పెట్టించలేదా? మరి అడవులకెళ్ళడమే గాక తర్వాత నిండు చూలాలుగా అడవుల పాలైనది. పై ముహూర్తములు పెట్టినది ఎవరో చేతగాని పౌరోహితులు కాదు. దైవజ్ఞులైన వశిష్టాదులే గదా? పాండవుల విషయంలో కూడా అంతే జరిగింది.

శ్రీ మాష్టరుగారికి ఉపనయనం చేయాలని ముహూర్తం పెడితే ఇంట్లో ఆ ముహూర్త సమయంలోనే బిడ్డ చనిపోయాడు. అయితే కృష్ణమాచారి గారు వివేకవంతులు గనుక బిడ్డ పోయిన విషయం ఎవ్వరికీ తెలియనీయకుండా శ్రీ మాష్టరుగారి ఉపనయనం పూర్తి చేయిస్తారు. మనమైతే మనకు అంటు అని, అపవిత్రమని, అపశకునమని ఉపనయనం ఆపించేస్తాము. మహనీయుడైన శ్రీ కృష్ణమాచారి గారు అలా చేయలేదు. వారి తండ్రి అనంతాచార్యులు గూడా అంటు, అపవిత్రము, అపశకునము అని తలచలేదు. ఇది నాకు తెలిసిన స్వల్ప జ్ఞానము మాత్రమే.

మంచి ముహూర్తాలలో శుభకార్యాలు చేయకనే మానవునకు కష్టాలు వస్తున్నాయా? లేక మంచి ముహూర్తాలలో చేస్తే కష్టాలు తప్పు తున్నాయా? గొప్పగా ముహూర్త బలాలు చూచి వివాహాలు చేసిన వారికి గూడా సంతానం కలుగడం లేదు. గనుక ముహూర్త బలము గొప్పదా? లేక పూర్వ కర్మ బలం గొప్పదా? మన కర్మ ఫలాలే మన కష్టాలకు కారణం గనుక శ్రీ వెంకయ్య స్వామి, శ్రీసాయి, శ్రీ మాష్టరుల వంటి మహనీయుల కృప పొందే విధంగా మనం నడుచుకొని అతిథులము గాకుండా ఆత్మీయులమైతే శ్రీ వెంకయ్య స్వామి గాని, శ్రీ మాష్టరుగాని మనలను తప్పక ఉద్ధరించి తీరుతారు. మనం అడగకుండానే ప్రార్థించకుండానే మనలను కాపాడుతారు. శ్రీ సాయి గారు ఉపాసనీ బాబాను రక్షించేందుకు ఉపాసనీ పిలుపు లేకుండానే వారి దగ్గరకు వెళ్ళారు. ఊహకందనంత దూరం నిచ్చెన ఎక్కించారు. ఉపాసనీ బాబా చివరిదాకా తన పట్టుదలను నిలుపుకో లేక పోయారు. గనుక పడి పోయారు. నిజమైన శరణాగతి చేస్తే శ్రీ మాష్టారి లాగా అయి ఉండేవాడే. " నా బిడ్డలాంటి వాడు" అన్నారు. అది చాలు. మనలను కూడా "అహంకారం వదలి మాష్టారి లాగా గురు కృప పొందండి.



జాతకాలు, ముహూర్త బలాలకై వెంపర్లాడ వద్దు. మన దృష్టంతా ఆత్మీయులవడమెట్లా" అనే దాని మీద కేంద్రీకరించ మంటున్నారు.

# శ్రీ మాష్టరుగారి వడుగు

గొప్ప నిదర్శనము :- మా దూరపు బంధువు చనిపోయాడు. మందిరంలోకి రావచ్చునా? అని కొందరు, మా తల్లి చనిపోయింది మందిరంలోకి రావచ్చునా అని మరి కొందరు. నా భార్య ప్రసవించింది గనుక మైల అని మరి కొందరంటున్నారు. వీటన్నింటికీ మంచి సమాధానం. శ్రీ మాష్టరుగారి వడుగు జరిగే సమయంలో అదే ఇంట్లో వాళ్ళ అన్న గారైన కృష్ణమాచారిగారి అబ్బాయి ఆ ముహూర్తంలోనే చనిపోయాడు. చనిపోయినట్లు ఎవ్వరికీ తెలియకుండా ఆ కొద్ది సేపు రహస్యంగా ఉంచారు. శ్రీమాన్ కృష్ణమాచారిగారు వడుగు నిర్విఘ్నంగా జరిపించారు.

1) అయితే బిడ్డ చనిపోతే తండ్రికి అంటు కాదా?
2) ఆ తండ్రి తమ్ముడైన శ్రీ మాష్టరుగారికి అంటులేదా?
3) అంటు అశుభము కాదా? అశుభ సమయములో వడుగు చేసుకుంటారా?
4) అశుభ సమయంలో వడుగు చేయించింది జ్యోతిష శాస్త్రవేత్తగా ప్రఖ్యాతి చెందిన శ్రీ కృష్ణమాచార్య గారు.
5) వడుగు ముహూర్తం పెట్టిన వారు దిక్దండులైన పండితులు.
6) దాన్ని సరి చూచిన వారు, మహా మేధావి దైవాంశ సంభూతుడు శ్రీమాన్ అనంతాచార్యులు గారు.

మరి శ్రీ మాష్టరుగారేమయ్యారు?

ప్రపంచంలోని మానవ జాతికే వెలుగునిచ్చే కరదీపిక అయి నిలిచారు. సాయినాథుడి బిడ్డడైనాడు. తనను తలవని ఆర్తులను కూడా సరైన సమయంలో మహా సమాధి అనంతరము కూడా ఆదుకొంటున్నారు.

మృత్యుంజయుడై మృత్యువు పై ఘన విజయం సాధించారు.

**"**మనం పెట్టించే ముహూర్తములు వాటి బలాలు ఏమిటో నాకు అగమ్య గోచరంగా ఉంది, అంటు, అశుభ సమయాలు అంటే నాకు మతి పోతుంది. చదువరులే ముహూర్త బలాలు అంటు. అశుభాలకు అర్థం ఏమిటో ఆచరణ ఎలాగో నిర్ణయించుకోండి. శ్రీ మాష్టరుగారు మన అందరికి వెలుగు నిచ్చే జ్యోతి అయ్యేందుకు వారు చూపిన **'1**. పట్టుదల **2**. నిర్భయత్వం **3**. తన మీద తనకు నమ్మకం **4**. ఎందరేమన్నా తన హృదయాంతర్గత భావాలు స్వచ్ఛంగా ఉంచుకొనే ప్రయత్నం చేస్తూ అలా నడవడం **5**. కఠోరమైన ఇంద్రియ నిగ్రహము.**'** మన శరీరమనే తోటలో పెంచే ప్రయత్నం చేస్తే శ్రీ మాష్టరుగారు వద్దన్నా మన వెంట ఉంటారు.**"**

# శ్రీ మాష్టరుగారి బోధలలో కొన్ని ముఖ్యమైనవి

**1)** భగవంతుడు మన నుండి కోరేది కాలము, మనస్సు మాత్రమే.

**2)** ప్రతిరోజు ఒకే timeలో పూజ చెయ్యటం

**3)** ఇష్టాయిష్టాలను విడనాడాలి. ఇష్టాయిష్టాలు లేకుండా టైంటేబులు ప్రకారం పని చెయ్యాలి.

**4)** సద్గురువును చూపేది పుణ్యమే.

**5)** ప్రతి చిన్నదానికీ గురువు మీద ఆధారపడాలి (సర్వస్యశరణాగతి). మన ఆలోచనలన్నీ మన అహంకారమే.

**6)** ఎంతో పుణ్యముంటే తప్ప సద్గురు సమాశ్రయం జరుగదు. ఇంకా ఎంతో పుణ్యముంటే తప్ప ఆయన కృపకి పాత్రులము కాలేము.

**7)** పరోపకారం పుణ్యం, పర పీడనం పాపం.

**8)** నిత్యం నాలుగు ఆరతులు ఇవ్వాలి. office (ఆఫీస్) లో బిజిగా ఉండే వారు కూడా తప్పక లఘు ఆరతి ( **2** ని॥ పాటు లేదా ఒకటి, రెండు చరణాలు) అయినా చెయ్యాలి.



**9)** విద్యార్థికి చెప్పబడిన లక్షణాలు **1**. మితాహారం, **2**. కాక దృష్టి, **3**. బక ధ్యానం, **4**. జీర్ణ వస్త్రం. ఆచరించకుంటే పూర్ణకృప పొందలేరు.

**10)** Live in the present. past and future పూర్తిగా వదలాలి.

**11)** సాధనలన్నీ మనస్సును నిగ్రహించేందుకే.

**12)** మనం మాట్లాడే మాటలతో సహా అంతా ముందు నిర్ణయం ప్రకారం జరుగుతుంది. కానీ మనోభావాలు మాత్రం నిర్ణయించ బడలేదు.

**13)** కష్టాలు కూడా అనుగ్రహానికి గుర్తు.

**14)** మానవుని ప్రథమ శత్రువు సోమరితనం.

**15)** ధ్యానాన్ని గజ స్నానం చేయకూడదు. ధ్యానం అంటే తనలోను, బయట, అంతటా ఉన్నది ఒక్కటేననే భావనతో ప్రతిదాని పట్ల గౌరవ భావము కలిగి ఉండటం.

**16)** ఎక్కడుంటే అక్కడ సత్సంగం చేయటం, మాష్టరుగారికి లక్షలు ఇచ్చినట్లు.

**17)** Function (కార్యము) విఫలమైనా, సఫలమైనా చలించక సాయిబాబా చేతిలో తెడ్డు వలె పని చెయ్యటం నిష్కామ కర్మ అవుతుంది. దీని ద్వారా మలదోష నివృత్తి జరుగును.

**18)** క్షణక్షణం ఆత్మ వికాసానికి కృషి చేయడం ఒక్కటే జీవిత లక్ష్యం.

**19)** మాయ ఎవరినీ తనకై తానే తనను అతిక్రమించనివ్వదు. నీ ప్రత్యేక ప్రయత్నం ద్వారానే మాయను అతిక్రమించాలి.

**20)** ఇచ్చిన సదవకాశం సద్వినియోగం చేసుకోకుంటే బూడిదై రాలిపోతావు.

**21)** సాయి కృప ఉందని మన ప్రయత్నాలు మానరాదు.

**22)** ఋణానుబంధాలు, బాధ్యతలు, యిచ్చిన వాగ్దానాలు, చేసిన ప్రమాణాలు తీరనిదే బ్రహ్మజ్ఞానం కోసం ప్రయత్నించరాదు.

**23)** పాలు తోడేసినప్పుడు పిల్లి పాడు చేయకుండా ఎంత జాగ్రత్తగా ఉంటామో అంత జాగ్రత్తగా మనస్సులోకి ఏ ఆలోచనలు రానీయకూడదు.

24) చిన్న చిన్న targets (లక్ష్యాలు) పెట్టుకొని మనస్సుని నియంత్రణ (control) లో ఉంచే ప్రయత్నం చేయాలి. అనుక్షణమూ వదలక ప్రయత్నించాలి. ప్రాయశ్చిత్తాలు ఎక్కువ బలము ఉత్సాహము ఇస్తాయి.

25) ప్రదక్షిణలు చేసేటప్పుడు నామావళి, వాటి యొక్క అర్థాలని ఒకదానికొకటి link చేస్తూ లీలలని మననం చేయాలి.

26) ధ్యాస లేకుండా గడిపిన క్షణాలలోని మనోవికారాలు జన్మ పరంపరలు పేనే తాళ్ళని గుర్తించి విషాన్ని త్యజించినట్లు త్యజించాలి.

27) సదాచారం అంటే ఎక్కడ బడితే అక్కడ తినకుండా ఉండటం కూడా.

28) శిష్యుణ్ణి సచ్ఛిష్యుడగా మార్చే బాధ్యత సద్గురువుదే. కానీ సచ్ఛిష్యుడయ్యే సంపూర్ణ ప్రయత్నం అవసరం.

29) గురుస్తుతి  నిద్ర లేచినప్పుడు మరియు నిద్రకుపక్రమించే టప్పుడు వీలైనంత సేపు సద్గురువు మన కిచ్చిన అనుభవాలను మననం చెయ్యాలి.

30) తైలధార వలె చేయు నామస్మరణతో మాత్రమే మన పాపాలు కడిగివేయ (దహించ) బడతాయి. అందుకని స్నానం చేసేటప్పుడు, పళ్ళు తోముకునే టప్పుడు, బట్టలు ఉతికే టప్పుడు, అన్నం వండేటప్పుడు, తినేటప్పుడు, రోడ్డున నడిచే టప్పుడు, మల మూత్ర విసర్జనప్పుడు, ఇల్లు సర్దుకునేటప్పుడు నామస్మరణ తప్పకుండా చేయాలి.

31) ఖాళీ సమయాలలో, పచ్చిశెనగలు/ బియ్యం నామస్మరణతో ఏరి, వాటిని ధునికి సమర్పించాలి. మందిరంలో కుదరకపోతే ఇంట్లో కుర్చీలో పటం పెట్టుకుని ప్రదక్షిణలు చెయ్యాలి.

32) అనుష్ఠానమంటే గురువు చెప్పినది ఎంతమటుకు పాటిస్తున్నాము, ఎక్కడ fail ( తప్పు) అవుతున్నాము, అడ్డంకులు ఏమిటో చూసుకొని, గురువు చెప్పినట్లు నడుచుకొనే ప్రయత్నం చేయాలి.



33) ఇంట్లో చేసే పూజ పైసా లాభమైతే, మందిరంలో చేసే పూజ రూపాయ లాభం, కాశీ, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాల్లో చేసే పూజ **1000** రూ॥ లాభం. అదే పూజ సద్గురు సన్నిధిలో చేస్తే అనంతమైన ఫలితం ఇస్తుంది.

34) అతిథుల లిస్టులో చేరకండి, ఆత్మీయులు కండి.

35) మనకిచ్చిన పనిని ఎవ్వరూ చేయలేనంత క్షుణ్ణంగా చెయ్యాలి.

36) వీలైనంతసేపు సద్గురు సన్నిధిలో గడపడం.

37) క్షమించాలి. ఎప్పుడు? తప్పు ఒప్పు కున్నప్పుడు. ఇతరులను గూర్చి విమర్శించి పుకారు లేపినప్పుడు, ఎదుటివారి పాపం విమర్శించినవారికి, విమర్శించినవారి పుణ్యం ఎదుటివారికి పోతుంది, (వార్తాలాపం - ప్రకాశానంద స్వామి). శ్రీ వెంకయ్య స్వామి వారు ఆయన మనుషులలోకి పోయి వచ్చాడు, ఆయన వద్దునీవు పోయి గంజి అనేవారు. గనుక నోరు అనే రంధ్రాన్ని మన జోలికి రాకుండా చేసుకుంటే కృప నిలుస్తుంది.

38) భోజన సమయానికి వచ్చిన అతిథికి దక్షిణ యివ్వడం లేదా భోజనం పెట్టడం.

39) సాయి సూక్తులు కేవలం మనస్సు కర్థమయ్యే పదజాలమూ, శబ్ద జాలమూ మాత్రమే కాదు. అవి మహామంత్రాలు, నిరంతర ఆత్మనిష్ఠయందు నిలిచి యుండే ఆత్మవేత్తల వాక్యాలు అట్టి అతీత తపశ్శక్తిచేత ఉత్తేజమయి యుంటాయి. ఆ వాక్యాలకు అర్హులైన హృదయాలపై మనస్సుకు, బుద్ధికీ అతీతమైన ప్రభావముంటుంది. మనస్సు, బుద్ధి ఏ ఆత్మనుండి ఉద్భవిస్తాయో అట్టి మూలమైన చైతన్య క్షేత్రంలోనే ఒక విశిష్టమైన జాగరణను కల్గించ గలవు.

40) ఈ సమాజానికి మనం ఎంత వరకు ఉపయోగ పడగలమో ఆలోచించి అంత మేరకు ఆచరించమని చెప్పేవారు.

# నాగతేంటి? నా తప్పేమిటి?

భక్తుడు:- నేనెన్నో సంవత్సరాలుగా పూజ, పారాయణ, జపం చేస్తున్నా నాకెలాంటి అనుభవాలు గాని, దైవమున్నట్లు నిదర్శనము గాని లేవు. నాగతేంటి? నా తప్పేమిటి సార్?

మాష్టరు:- మనం చేసిన **1**. వాగ్దానాలు, **2**. ప్రమాణాలు, **3**. బాధ్యతలు, **4**. ఋణానుబంధాలు నెరవేర్చకపోవటమే అందుకు కారణము. అర్థేచ, కామేచ, ధర్మేచ, మోక్షేచ నాతి చరామి ఆచరించుచున్నావా? నీ బాధ్యత, కుటుంబ బాధ్యతగానీ, ఆఫీసు బాధ్యత గానీ సక్రమంగా నూటికి నూరు పాళ్ళు ఆచరిస్తున్నావా? పెండ్లి నాటి ప్రమాణాలు ఏమి చేశావు?

నీవు చెప్పిన సాధనలన్నింటికీ ఫలితం రావాలంటే పెండ్లి నాటి ప్రమాణాలు సెంట్ పర్సెంట్ ఆచరించాలి. అర్ధాంగి లేకుండా ఆకలి చల్లార్చుకోవడం తప్ప మిగిలిన ఇంద్రియ సుఖాలు ఎప్పుడూ ఎట్టి పరిస్థితులలోను అనుభవించరాదు. మనం కమ్మని టీ పార్టీలు, విందు భోజనాలు, స్నేహితుల బలవంతాలకు లొంగి ఏ ఇంద్రియసుఖం అనుభవించడం లేదో చూచుకో అని మానవాళిని హెచ్చరిస్తున్నారు. ఇక్కడ శ్రీ వాసుదేవానంద సరస్వతి గారి ఆచరణ మనం బాగా గుర్తించుకోవాలి.

## పుణ్యం పాపాన్ని రద్దు చేస్తుందా?

భక్తుడు:- పుణ్యం పాపాన్ని రద్దు చేస్తుందా?

మాష్టర్:- రద్దు చేస్తుంది. రద్దు చేయదు.

భక్తుడు:- అదెట్లా సార్, రెండు సమాధానాలు కరెక్టు ఎట్లా అవుతాయి.

మాష్టర్:- ఒకనికి ఒక సమయంలో కేవలం పాపమే అనుభవం కావాలి. పుణ్యంలేనే లేదు. అతనికి చలి జ్వరమొచ్చింది. ఉండేందుకు



ఇల్లు లేదు గనుక బస్ షెల్టరులో అరుగు క్రింద ముడుక్కొని ఉన్నాడు. మందు లేదు. కప్పుకోను దుప్పటి లేదు. పొట్టకు ఆహారం లేదు. అది అతని పాప ఫలితం. పుణ్యం సున్నాగదా!

మరియొకనికి ఒకే సమయంలో పాప, పుణ్యాలు రెండూ అనుభవమవవలసి ఉంది. అతనికి కూడా పాప ఫలితంగా జ్వరమే వచ్చింది. కానీ పుణ్య ఫలితంగా మంచి ఇల్లు ఉంది. సేవచేసే భార్య ఉంది, ఇంటికి డాక్టరు వచ్చి మందులిచ్చి పోతాడు. కడుపుకు ద్రవాహారం నోటి దగ్గరకు వస్తుంది. కప్పుకోను మంచి ఉలన్ రగ్గు ఉంది. ఈ వసతులన్నీ పుణ్యఫలం వల్ల కలిగాయి. పాప ఫలం వల్ల పై వ్యక్తి వంటి చలి జ్వరమే ఉంది. కానీ ఇల్లు, భార్య, ఆహారం, డాక్టరు, రగ్గులు మందులు ఉన్నందు వలన మొదటి వ్యక్తిలాంటి బాధలు లేవు. గనుక పాప ఫలం అనుభవిస్తున్నా అది అనుభవించనట్లే అవుతుంది. అంత బాధ లేదు. రెండవ వ్యక్తి విషయంలో పాపం పుణ్యంవల్ల రద్దయినదనే చెప్పవచ్చు. ఆలోచించు, ఆర్గ్యుమెంటు కాదు అని ముగించారు.

## ప్రేమమయుడు

-ఎ.నరసింగయ్య, అనంతపూర్

నేను సోమరిని కాని మాతృ ప్రేమకంటే అధిక ప్రేమ మూర్తియైన శ్రీమాష్టరుగారు **2004** అక్టోబరు **29**తే రాత్రి నన్ను నిద్రలేపి పారాయణ గావించు అని వీపు తట్టారు, ఆశ్చర్యంతో కళ్ళు తెరచి చూస్తే ఎవరూ లేరు. ఆశ్చర్యపోతూనే ఆచరించాలనే ప్రేరణ కల్గించారు నాటి నుండి నిత్యమూ వేకువజామున నాల్గుగంటల నుండి నిర్విఘ్నంగా పారాయణ చేయిస్తున్న కరుణామయుడు మన మాష్టరుగారు.

ఓ పాఠక మహాశయులారా మనలో అనేక మంది నాకు పారాయణ సరిగా జరుగుట లేదు అని బాధ పడుతుంటారు, పుణ్యం పెంచుకుంటే ఏ సద్గురువైనా కల్పించుకొని మన బండి రిపేరు చేస్తారు. పరపీడనం పాపం పరోపకారం పుణ్యం అని అన్నారు.

గుర్వాజ్ఞలు పాటించేందుకు మనలో సంసిద్ధత ఉండాలి అప్పుడే గురువు మన బండిని రిపేరు చేస్తారు.

# శ్రీ భరద్వాజ మాష్టరుగారు ఒక్కరు చాలరా?

-V.C. వెంకటేశ్వర్లు, పుత్తూరు.

శ్రీ భరద్వాజ మాష్టరుగారు ఒక్కరు చాలరా, ఇతర మహాత్ములను దర్శించడం ఎందుకు? అనే ప్రశ్న అనేక మంది అడుగుచున్నారు. దీనికి శ్రీ మాష్టారు గారు చెప్పిన సమాధానం గాని, గురు గీత చెప్పే సమాధానం గాని, భగవద్గీత చెప్పే సమాధానం గాని, గురుచరిత్రలో అవధూత చెప్పే సమాధానం గాని అన్నీ ఒకే సమాధానమును వివిధ విధాలుగా మాటలు మార్చి చెపుతున్నారు.

శ్రీ మాష్టరుగారు చెపుతారు మహనీయుల రూపాలు వేరైనా వారంతా ఒకే వృక్షానికి చెందిన వివిధ పత్రాలు. నామ రూపాలలో, జీవిత విధానాలలో, వారి మాటలలోని బోధలలో మనకు వారు వేరైనట్లు కనపడవచ్చు. కాని నిజానికి వారి ఆంతర్యం ఒక్కటే.

గురుగీత నిర్దేశించినట్లు తేనె కోరిన తుమ్మెద ఎన్నో పుష్పాలనాశ్రయించి తేనె సంపాదించినట్లు జ్ఞానము కోరిన శిష్యుడు అనేక మంది గురువుల నాశ్రయించాలి అంటున్నారు. వివిధ పుష్పాల రంగు, రుచి, వాసనలను పట్టించు కోకుండా వానిలోని తేనెనే తుమ్మెద గ్రహించినట్లు మనం వివిధ మహత్ములనుండి జ్ఞానం ఆర్జించాలి అన్నారు. శ్రీ మాష్టారు ఆచరించి చూపారు.

భేద భావము లేకుండా అందరు మహనీయులు ఒక్కటే అని తన మూల గురువును స్మరించి దర్శించిన భక్తులందరికీ వివిధ గురువుల నుండి దివ్యమైన అనుభవములు కల్గడం చూస్తున్నాము కదా.

శ్రీ సాయి, శ్రీ తాజుద్దీన్ బాబా, శ్రీ అక్కలకోట మహరాజ్ వంటి ఎందరో మహనీయులు తమ దగ్గర కొచ్చిన భక్తులను ఇతర మహాత్ముల దగ్గరకు పంపడం చూస్తాము.



శ్రీ మాష్టరుగారు చెపుతారు, “మహనీయులంతా మిఠాయి కట్టిన కాగితంలాంటి వారు. అందరిలో ఉండే మిఠాయి ఒక్కటే. వివిధ మహాత్ముల సంప్రదాయాలు, ఆచారాల వంటి వాటికి ప్రాధాన్య మివ్వకుండా వారు సూత్రీకరించి బోధించిన సిద్ధాంతం చూస్తే అందరి సిద్ధాంతాలలోని ఆంతర్యం ఒక్కటే. సర్వస్య శరణాగతి నీ బుద్ధిని ప్రక్కన పెట్టి గురువు చెప్పినట్లు చేయడం, చేసినట్లు చేయడం కాదు. వాటినే నిష్ఠ, సబూరీలు అంటారు.”

సందర్భాన్ని బట్టి ఒక్కొక్క మహనీయుడు ఒక్కొక్క బోధ చేస్తుంటారు.

చివటం అమ్మ, మేము వస్తాం పోతాం ఇంతే గదమ్మా అన్న భక్తురాలితో అంటారు " నీకు రావడమైనా వచ్చిందటే". మహనీయుల సన్నిధికి ఎలా రావాలి? మహనీయుల సన్నిధిలో ఎలా ఉండాలి? మహనీయుల సన్నిధి వదిలి పోయాక ఇంటి దగ్గర ఎలా ఉండాలి నేర్చుకో మంటారు.

అలాగే శ్రీ సిద్ధారూఢ స్వామి వారు మనకు గల్గే కష్ట నష్టాలకు కారణం, భగవత్ సూత్రం ఎలా పని చేస్తుందో చెపుతారు.

"పూర్వజన్మ ఋణానుబంధాన్ని అనుసరించి మన శత్రువు మన ఎదుట పడగానే మన కర్మే మన శత్రువు యొక్క కంటి ద్వారము ద్వారా ప్రవేశించి అక్కడ విశ్వగురునిచే ప్రేరేపించబడి, మనకపకారం చేస్తాడు" అని చెపుతారు.

ఇలా ఒక్కొక్క మహనీయుని దగ్గర ఒక్కొక్క విషయం నేర్చుకొంటూ అందరు మహనీయులను దర్శించడం అవసరమని శ్రీ మాష్టారు గారు బోధిస్తారు.

# స్వప్న దర్శనం

-M.M. చంద్రబాబు, సూళ్ళూరుపేట

శ్రీ సాయినాథుడు మహాసమాధి వరకు నేను అల్లాకు బానిసను అనేవారు. నేనే సద్గురువును అనే భావం నెప్పుడూ రానివ్వ లేదు. కమెండో

పత్రికలో భరద్వాజ గారంతటి దుర్మార్గుడు లేడు అని వ్రాసినా చలించలేదు. అలాగే శ్రీ వెంకయ్య స్వామి సేవకుడు రోశిరెడ్డి గారికి మరియు శ్రీ పాకలపాటి గురువు గారికి శంఖు చక్రాలతో దర్శనమిచ్చినా వారు నిరాడంబరముగా గురువు కావాలనే గుబులు పుట్టకుండా ఉండుగాక అనే పద్ధతిలోనే ఉన్నారు.

ఒకనాడు నా స్వప్నంలో గుండు చేయించుకొని మా ఇంటికి వచ్చి మంచం మీద కూర్చున్నారు. నేల పై కూర్చుని భోంచేశారు. **15** రోజుల తరువాత నిజంగానే అలాగే తల గుండు చేయించుకొని వచ్చి మంచం మీద కూర్చుని, నేలమీద కూర్చుని భోంచేశారు. ఆ స్వప్న వృత్తాంతం విని ఇలాంటి వాటిని ఎక్కువగా పట్టించుకోవద్దని చెప్పారు. వాళ్ళ తండ్రి గారు పోయాక అలా గుండు చేయించారని తెలిసింది

# జంధ్యం, గాయత్రీల లక్ష్యం

వివాహానికి ముందు వడుగు చేసుకొని జంధ్యం వేసుకొని గాయత్రీ చేయడం గురించి శ్రీ మాష్టారు గారిని అడిగాను. జంధ్యంలోని మూడు ముళ్ళు బ్రహ్మ, విష్ణు, శివ రూపాలని ఈ సృష్టంతా ఈ మూడింటి కలయిక అని అనుక్షణం గుర్తుంచుకోవడమే జంధ్యం, గాయత్రీల లక్ష్యం అంతేగాని వీపు గీరు కోవడానికి కాదు అని బోధించారు.

# మానవ జాతికి ఆధారం

మానవజాతికంతకూ శ్రీ మాష్టరుగారు ఎంత గొప్ప ఆధారాన్ని అందించారో ఈ క్రింది అనుభవం తెల్పుతుంది. ఆమెను ప్రాణాపాయ పరిస్థితులలో ఆస్పత్రిలో చేర్చింది శ్రీ సాయినాథుడే. ఆ సాయిని ఆశ్రయించేటట్లు చేసింది శ్రీ మాష్టరుగారు మాత్రమే.

నా పేరు రాజ్యలక్ష్మి. **1993** డిసెంబర్ **5**న మా కారును RTC బస్సు గుద్దింది. కారు డౌన్‌లో పడేటప్పుడు "బాబా" అని కేక పెట్టాను. క్రింద పడ్డ



వాళ్ళందరినీ గుంటూరు ఆస్పత్రిలో చేర్చారు. కానీ తుప్పలలో పడి ఉన్న నేను వారికి కనిపించనందున వెతికి వెతికి మిగతా వారి పరిస్థితి చూడలేక వెళ్ళిపోయారు. వారు వెళ్ళాక నెత్తిన తెల్లటోపి, లాల్చీ, పైజామా ధరించిన వ్యక్తి వచ్చి స్పృహలో లేని నన్ను కారులో కృష్ణలంకలోని మా బావ దగ్గరకు తీసుక వెళ్ళి అక్కడి వాళ్ళను తీసుకువెళ్ళి, ఆస్పత్రిలో చేర్చి, నా వంటినున్న నగలు మా బావగారికిస్తూ, ఇవి ఆమె నగలు. ఆమె మూడు నెలలకు కోలుకుంటుంది. ఈలోగా జాగ్రత్తగా చూచుకోండి. కోలుకోగానే నగలు ఆమె కివ్వమని చెప్పి వెళ్ళి పోయాడు. తానెవరైంది చెప్పలేదు.

కోమాలో నుండి బయట పడితే బ్రతకవచ్చు, బ్రతికినా నడవలేదు. కూర్చొని ఉండాల్సిందేనని డాక్టర్లు చెప్పారు. కానీ బాబా చెప్పినట్లు ప్రస్తుతం మూడు నెలలకే కోలుకొని నేడు నడువ కల్గి అన్నీ పనులూ స్వయంగా చేసుకొనుచున్నాను. కారులో నన్ను ఆస్పత్రికి తీసుకువచ్చిన వారు బాబా గారు, శ్రీ మాష్టరుగారు అని నా సంపూర్ణ విశ్వాసము. బాబాను చక్కగా సేవించే మార్గంలో నన్ను నడపమని ప్రార్థిస్తున్నాను.

ఆ మహనీయుల అవతారకార్యములో మనం పాలు పంచుకోవడమే వారికి మనం చేసే గొప్ప సేవ. తెలిసిన వారికందరకూ వారి దివ్యలీలలు వినిపించడము, పుస్తకాలు పంచడము. సత్సంగాలు చేయడమే వారు కోరే సేవ. అది చేసి తరిద్దాం.

# పిలవగానే పలికే పావనమూర్తి

.

-T. నటరాజబాబా, కావలి.

మా పెద్దమ్మాయి పెండ్లి సందర్భంలో, నేను మూడు నెలల తరువాత పెండ్లి చేస్తానంటాను. కారణం GPF నుండి లోను తీసుకోవాలి. వాళ్ళు, "వచ్చే నెలలో చేసుకుంటే చేసుకో లేకుంటే, ఈ సంబంధం వదులుకో. ఏ విషయం ఐదు నిమషాల లోపల చెప్పమని నిర్బంధించారు. నే కూర్చున్న చోటే కళ్ళు మూసుకొని "మాష్టారూ" అని ఆర్తితో పిలిచాను. వెంటనే వారి

దివ్యబోధ వినిపిస్తుంది. "సృష్టి మొదలైనప్పటి నుండి ఇప్పటి వరకు అమ్మాయి అందంగా లేదనిగాని, డబ్బు లేదనిగాని, పెండ్లి ఆగిపోలేదు. అన్నీ ఉండి, అమ్మాయి అందంగా ఉండి, డబ్బు ఉండి కూడా ఎన్నో పెండ్లిళ్ళు ఆగిపోయాయి. సాయిబాబా ఇవ్వదలుచుకుంటే  తంబ చెట్టు పెరికి నిధి ఇవ్వలేదా? గొడ్డు గేదెను పాలు పితుకు అంటే పాలివ్వలేదా? అన్నీ జరుగుతాయి ఒప్పేసుకో" అన్నారు. నేనంగీకరించాను. అన్నీ సవ్యంగా జరిగి పోయాయి.

ఈ పెండ్లి జరిగి పోయాక నాకు సబ్‌కాన్షెస్ లెవల్‌లో **1/100** వ వంతు గురువు గారిపై అపనమ్మకమున్నదేమో నాకు తెలియదు. ఒకనాటి రాత్రి షడన్‌గా నా తలలోని నరాలు చిట్లి పోయినంత బాధతో దిగ్గున నిద్ర లేచి కళ్ళు మూశాను. "ఈ కార్యం ఎలా జరుగుతుందని నీ గురువుపై **1/100** వ వంతు అనుమానం కలిగినా నీవు ఫెయిల్ అయినట్లే" అన్నారు శ్రీ మాష్టరుగారు దర్శనమిచ్చి. "మాష్టారూ నీపైన అణువంత కూడా అపనమ్మకం లేదయ్యా అంతా నీవే చేస్తున్నావు" అంటూ నమస్కరించగానే మాష్టారు అదృశ్యం కావడం, మరు క్షణంలో నా భయంకరమైన తలనొప్పి పోయి నిద్రపోవడం జరిగింది.

గురువు గారి సామర్ధ్యంపై సబ్‌కాన్షెస్ లెవల్లో కూడా **1/100** వ వంతు అపనమ్మకం కూడా ఉండకూడదని శ్రీ మాష్టరు మానవాళికి బోధిస్తున్నారు.

# పవిత్ర కోరిక తీర్చిన పావనమూర్తి

**1988** విజయదశమికి పాదుకలు చేయించి శ్రీ మాష్టరుగారు ధరించాక తెచ్చి నిత్యం పూజించాలని నాకు సంకల్పం పెట్టారు. కానీ పాదుకలు ధరించమంటే  నిరాకరించారు. నా మొండి తనానికి కరిగిపోయి సాయిబాబా మిషన్ కార్యాలయంలో ధరించి కొంత సేపు ఉంచుకొని ఇచ్చారు. నిత్యం వాటిని పూజిస్తూ నైవేద్యాలు అర్పిస్తున్నాము.

రాజీవ్ గాంధీ హత్యా కారణంగా షిరిడీలో అల్లర్లు జరిగి ఆ టైంలో



అక్కడున్న మా శ్రీమతి తనతో ఉన్న పాదుకలు తీసుకొని తిరిగి మా గ్రామం వచ్చేసింది. ఎంతో అసంతృప్తితో, ఆమె మనస్సులో, హృదయంలో ఎంత వేదన ఉండెనో ఏమో మధ్యాహ్న సమయంలో మగతనిద్రలో నున్న ఆమెను లేపి భౌతిక దర్శనమిచ్చి "ఆ పాదుకల రూపములో నేనున్నాను కదా" అని ఓదార్చి అదృశ్యమయ్యారు. అలాగే మరలా దత్తక్షేత్రాలకు తీసుకు వెళ్ళారు. కరంజాలో పాదుకలకు భజన, పూజ అన్నీ అయ్యాయి గాని బడలిక వలన నైవేద్యం మరచిపోయింది. నాటి రాత్రి ఆరు, ఏడు సంవత్సరాల పిల్లవానివలె శ్రీ మాష్టారు గారు దర్శనమిచ్చి "అమ్మా, ఈవేళ నాకు అన్నం పెట్టలేదమ్మా, ఆకలిగా వుంది" అన్నారు. "అయ్యో! మాష్టరుగారూ చింతకాయ పచ్చడి మాత్రమే వుందే" అంటే పెట్టమ్మా అని భోజనం తిని వెళ్ళారు.

ఇలాంటి అనుభవాలు, "స్వప్నాలే గదా అని తీసి వేయరాదు" అంటారు శ్రీ మాష్టారు. స్వప్నాలలో మన మనస్సు ఏ రూపమైనా ధరించ వచ్చు గాని సద్గురుని రూపం ధరించలేదు. అలా వారు స్వప్న దర్శనమిచ్చారంటే, అది కేవలం వారికి మనపై ఉన్న కరుణే కారణం. స్వప్నాదేశాన్ని యథాతథంగా ఆచరించి కృతార్థులము కావాలి. బావిలో దూకమన్నా వెనుక ముందు చూడకుండా దూకాలి అని చెప్పారు.

ఇందుకు ఉదాహరణగా శ్రీసాయి కాబూల్‌లోని భక్తుని (ఆత్మారామ్ చునీలాల్ భగత్)కి కన్పించి ఒకసారి సముద్రంలోకి పొమ్మనడం, మరొకసారి కాబూలులో గుడ్డలు విప్పి నగ్నంగా తిరగమనడం, అలా చేయగానే ఆ భక్తునికి బ్రహ్మానుభూతి కల్గడం జరిగింది.

# శ్రీమాష్టరు చూపిన సాయి మార్గం

-మూర్ఖ బాలుడు

**1**. సేవ:- ఈ సృష్టంతా తానే అయిన సాయి అర్ధ రాత్రి తన దర్శనానికి వచ్చే భక్తులకు లాంతరు తీసుకొని ఎదురు పోయి**,** "కౌన్ రే" అని

పలకరించి, ఎద్దులకు నీళ్ళు పెట్టించి, వారికి తాత్యాగారిని తోడిచ్చి, రాధాకృష్ణఆయీ దగ్గరకు పంపి ఆహారం పెట్టించారు.

శ్రీమాష్టరుగారు అర్ధ రాత్రి వేళ వచ్చిన అతిథులకు గూడా తానే స్వయంగా చెంబుతో మంచినీళ్ళు బిస్కెట్ పొట్లమిచ్చి తిని పడుకోమని చెప్పేవారు. సాయిని గురించి చెప్పి సత్‌సంగము ఏర్పాటు చేసేందుకు ఎంత దూరమైనా బడలిక అనుకోకుండా వెళ్ళి వచ్చేవారు. సాయిని పరిచయము చేస్తే ఆ మహనీయుడే వారి కష్టాలన్నీ తీరుస్తారు అని చెప్పి ప్రతివారికి సాయిని గురించి చెప్పి, వారికి తెలిసిన వారికి సాయిని పరిచయం చేయమనేవారు. ఎలాంటి కష్టాలైనా సాయి తీరుస్తారని చెప్పేవారు. ఈవిధంగా సాయిని అందరికీ పరిచయం చేయడంలో శ్రీమాష్టరుగారు ఆకలి దప్పులే మరచేవారు.

శ్రీ సాయిని పరిచయం చేసేందుకు ఎన్ని ఫోటోలు తెచ్చి ఎంత మందికి ఇచ్చారో, ఎన్ని పుస్తకాలు ఫ్రీగా పంచారో, పుస్తకాలమీద లాభాలు లేకుండా సేల్‌చేశారు. మనం ఎప్పుడో శిరిడీ వెళ్ళినప్పుడు వంద పాకెట్ సైజు ఫోటోలు తెచ్చి అవసరమున్నా లేకున్నా తలా ఒకటి అంత ప్రసాదంగా పంచి చెయ్యి కడిగేస్తాం. వారు నిరంతరమూ ఫోటోలు అందరికీ ఫ్రీగానే ఇచ్చేవారు. ఆ రోజులలో లితో ప్రింటింగ్ లేదు. అన్నీ ఫోటోగ్రాఫిక్ ప్రింట్లే. చాలా ధరకూడా.

వైద్య సేవ:- చద్దన్నం తిని తానొక్కరే విద్యానగర్‌లో డాక్టరును మెయింటెయిన్ చేశారు. ఈ డాక్టరుగారి సేవలు విద్యానగరుకు మాత్రమే పరిమితం గాక వారమునకు ఒక రోజు గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట, శ్రీహరికోట, నెల్లూరు, ఒంగోలులలో మందులు ఇచ్చేవారు.

కోటలో స్కూలు పెట్టించారు:- టీచర్లందరూ సాయి సేవకులే, ఎవ్వరికి జీతములు ఇచ్చినా తీసుకోరు. అన్నం మాత్రమే తిని పని చేసేవారు. చుట్టుప్రక్కల గవర్నమెంట్ ఎలిమెంటరీ స్కూళ్ళలో విద్యార్థులు లేక రిట్రెంచ్‌మెంట్ వచ్చింది. వీళ్ళ బడికి వచ్చిన విద్యార్థి తన టీచర్‌ను వదలి ఇంటికే పోడు. తల్లి దండ్రులకు ఒక విద్యార్థికి రోజుకు ఐదు రూపాయలు



లెక్కన నెలకు **150** రూ|| మిగిలేది. ఎందుకు? బడికి వెళ్ళేటప్పుడు, వంటేలు గంటకు, సాయంత్రము ఇంటికి వచ్చినప్పుడు, ఐసు ఫ్రూట్లకు, చాక్‌లెట్లకు డబ్బు మిగిలి పోయింది. బడికి వస్తే ఇక టీచరుని వదలి పొమ్మనా పోరు. రాత్రికి తల్లి దండ్రులే వచ్చి బిడ్డలను ఇండ్లకు తీసుకొని వెళ్ళేవారు.

అన్నం లేని వారికి అన్నం గుడ్డలు లేని వారికి గుడ్డలు ఇవ్వు. భగవంతుడు సంతోషిస్తాడు అని సాయి చెపితే, శ్రీమాష్టరుగారు బయట మెస్సులో **8** మందిని సంవత్సరాలుగా చాకాడు. ఇంట్లో **5** మందికి నిత్యం అన్నం పెట్టారు. ఋణానుబంధాన్ని విశ్వసించి ఏ ప్రాణిని తోలెయ్య వద్దు అన్న సాయి ఆజ్ఞను అంత చక్కగా ఆచరించి మనకు ఆదర్శప్రాయుడైనాడు.

ఒక విద్యార్థికి ఒకే జత గుడ్డలున్నాయి. వాటినే నిత్యం ఉతికి వేసుకొనేవాడు. ఒకరోజతడు తడిగుడ్డలతోనే హారతి తీసుకోవడం చూచి అతని పరిస్థితి కనుక్కొని ఒకేసారి తాను కుట్టించుకుని ఇంకా వంటికే తగిలించని **3** జతల క్రొత్త గుడ్డలిచ్చి ఆల్టర్ చేయించి వేసుకోమన్న మహనీయుడు. తన ఆచరణతోనే బోధిస్తున్నారు.

అలాగే ఒక బిచ్చగాడు చలికి వణికి పోతున్నాను స్వామి అంటే **500** రూ|| ఖరీదు చేసే జరీ శాలువను అతనికి కైంకర్యము చేశారు. అలాంటి ఉదార స్వభావము, దయను అలవరుచుకోమని బోధిస్తున్నారు.

నీవు సత్యాన్ని అంటిపెట్టుకొని విశ్వాసం గల్గి ఓర్పుతో ఉండు. నేనెప్పుడూ నీ వెంట ఉంటాను.

నేను రాజకీయాలలో పాల్గొనను. నావిధి నిర్వాహణ చక్కగా చేస్తాను అని oath taking (ప్రమాణం చెయ్యవలసి) ఉంటుంది. అది ఒక మంత్రులకు, గవర్నర్లకు, ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా లాంటి పోస్టులకే మైకులలో ప్రమాణాలు. తక్కిన వాళ్ళందరికి కాగితాల మీద సంతకాలే. ఆ కాగితంలో ఏముండేది కూడా చదవము. రైల్వేలో పార్మాసిస్టు ఉద్యోగం లో చేరడానికి నా కుమార్తె పోతే oath taking అయ్యాక appointment order ఇస్తాము అని కాగితం వచ్చింది. అదేదో పెద్ద ప్రమాణ స్వీకారమనుకొన్నాను. ఏమీలేదు రెండు కాగితాలపై సంతకాలే, ఆకాగితాలలో ఏముందో

చదవనుకూడా లేదు. సంతకాలు చేస్తూనే appointment order ఇచ్చారు. గనుక లెక్చరర్, టీచర్ అందరికీ ఈ తంతు ఉంది. దీనిని శ్రీమాష్టరుగారు ఎంత చక్కగా ఆచరించి చూపారో చూడండి. ఏనాడు పది నిమషాలు ముందే కాలేజీకి వెళ్ళాలి. తన కొరకు వచ్చిన వారితో మాట్లాడుతూ వుంటారు. అమ్మా నాకు టైం అయ్యింది వెళ్ళాలని ఉన్నట్లుండి ఇంట్లోకి వెళ్ళి ప్యాంట్, చొక్కా ఒక్క నిమిషంలో తగిలించి, ఒక ఇడ్లీ ముద్ద చేసి నోట్లో వేసుకొని దోవన నడుస్తూ చొక్కా గుండీలు పెట్టుకుంటారు. రెండు నిమషాలలో పిలిస్తే వినబడనంత దూరం వెళ్ళేవారు. మనకైతే పది నిమషాలు ఆపాటి ప్రయాణానికి చాలదు. ఎప్పుడూ ఆలస్యమనేది ఉండదు. నా విధి నిర్వహణ చక్కగా చేస్తానని ప్రమాణం చేసినందుకు వారి ఆచరణ ఒక మచ్చుతునక. ఉదాహరణకు శ్రీమాష్టరుగారి సహచరుడు ఒక పత్రికలో వ్రాసాడు ఒక కాలేజీలో పని చేస్తున్నారు. ప్రిన్సిపాల్ సక్రమంగా కాలేజీకి రారు. గనుక మిగిలిన లెక్చరర్లు కూడా అంతే. ఒక రాజకీయ నాయకుని కుమార్తె పరీక్షలు వ్రాస్తుంటే లెక్చరర్లందరూ ఆమెచే కాపీలు వ్రాయిస్తున్నారు.

ఒక పరీక్షకు శ్రీమాష్టరుగారు సూపర్‌వైజర్‌గా ఆ రూమ్‌కి వెళ్ళాలి. స్టాఫ్ బలవంతంపైన ప్రిన్సిపాల్ ఆ రూమ్‌కి నాలుగు రూమ్‌ల తరువాత శ్రీమాష్టరుగారికి డ్యూటి వేశారు. నాలుగు రూముల తరువాత అంటే ఆ అమ్మాయి రూముకు ఎదురు రూము. శ్రీమాష్టరుగారు తన రూము తాను సూపర్‌వైజ్ చేస్తూ ఆ అమ్మాయి కాపీలు కొట్టేందుకు సహాయం చేస్తున్న లెక్చరర్‌ను తగవులాడి నీపైన ప్రిన్సిపాల్‌కు కంప్లెయింట్ ఇస్తాను అని అరుస్తున్నారు. అది చాలక ఆ రోజు సాయంకాలం ఆ అమ్మాయి వాళ్ళ యింటికి వెళ్ళి వాళ్ళ నాన్నగారితో "మీలాంటి గొప్ప వాళ్ళు ఇలా కాపీలు వ్రాయమని అమ్మాయికి, వ్రాయించమని లెక్చరర్లకు చెప్పడం మంచిదికాదని" ముఖాన్నే చెప్పారు. మా అమ్మాయి పరీక్ష వ్రాస్తుండే విషయమే నాకు తెలియదు. ఆమె పరీక్ష పాసై ఉద్యోగాలు చేయవక్కరలేదు. మీ యిష్టమొచ్చినట్లు స్ట్రిక్టుగా మీ విధి నిర్వహించండి అని ఆ తండ్రి చెప్పారు. వెంటనే ఆ కాలేజీలో రాజీనామా ఇచ్చారు. ఏ పని చెయ్యడానికి



అంగీకరిస్తావో ఆ పని క్షుణ్ణంగా చెయ్యి, లేకుంటే అంగీకరించబోకు అన్న సాయి వాక్యం ప్రకారం ఆ కాలేజీ వదలినంతవరకు వారికి నిద్ర పట్టలేదు. భయానికి, మోమాటానికీ వారి జీవితంలో తావేలేదు. ఆ విధంగా అభయం సత్వ సంశుద్ధిః అన్న భగవద్గీతా వాక్యాన్ని ఆచరించి తరించి సాయికృపను పొందమంటున్నారు.

ఒంగోలు కాలేజీలో పనిచేస్తుంటే పరీక్షలటైంలో వీరు సూపర్‌వైజర్‌గా వస్తే అందరమూ పరీక్ష వ్రాయలేమని నలుగురు కుర్రాళ్ళు వచ్చి ఆ రాత్రి వారిని బెదిరించి, రేపు కాలేజీకి రావద్దు, వస్తే మాచేతులలో చచ్చిపోతావు అంటారు. తెల్లవారి వీరు కాలేజీకి వెళుతారు. కానీ ఆ విద్యార్థులు కిం అనకుండా పరీక్ష వ్రాసి వెళుతారు. అభయం సత్వ సంశుద్ధిః. వారి ఆచరణ చూచి అందరూ నేర్చుకొని ఆచరించి తరించమంటున్నారు.

పెండ్లి నాటి ప్రమాణాలు:- గోపాల్ పెండ్లిలో విందు భోజనము, విస్తర నిండా పదార్థాలు తాకి అన్నం మద్యలో మజ్జిగ వేసుకొని తినిలేచారు. ఏమిసార్ కొద్దిగానైనా పిండి వంటలు తినలేదన్నారు. "అర్థేచ, కామేచ, ధర్మేచ, మోక్షేచ నాతి చరామి" అని పెండ్లినాడు ప్రమాణం చేశాము, గనుక ఆమె తీసుకోకుండా మనం తినడం దోషం సుబ్బరామయ్యా" అన్నారు. మనం వారిలాగ ఆచరించడంలేదు గనుకనే మనమెన్ని సాధనలు చేసినా మనకు అభివృద్ధిలేదు దుఃఖనాశనం కావడంలేదు. ఇచ్చినమాట తప్పక చెల్లించు అన్న సాయి ఆజ్ఞ ఎంత లోతుగా యోచించి ఆచరిస్తూ మనలను ఆచరించమని ప్రభోధిస్తున్నారో చూడండి.

ఆకలిగొన్న వారికి అన్నము, గుడ్డలు లేనివారికి గుడ్డలు ఇవ్వు, భగవంతుడు సంతోషిస్తాడు:- ఒక చిన్న పిల్లవాడు శ్రీమాష్టరుగారికి లెటర్ వ్రాస్తాడు. "సార్ తమరు దయామయులని విన్నాను. మేము చాలా బీదవాళ్ళము. నాకు ఒకే జత గుడ్డలున్నాయి. పుస్తకాలు లేవు. స్కూలు జీతాలు చెల్లించలేకున్నాను. దయచేసి సహాయం చేయమని వ్రాస్తే, శ్రీమాష్టరుగారు వెంటనే అతనికి గుడ్డలు డబ్బులు ఏర్పాటు చేశారు. అది వారి దయారసానికి పరాకాష్ఠ.

ప్రెస్ పెట్టడం:- తను హైస్కూలు చదివేటప్పటి నుండి శ్రీమాష్టరుగారితో పరిచయం ఉండే విద్యార్థి B.A. కాగానే సారాయి అంగటిలో ఉద్యోగానికి పెట్టారు. అతడా వాతావరణంలో ఉండలేక శ్రీమాష్టరుగారితో చెప్పుకునేవాడు. బాబా మనలను ఎక్కడ ఉంచితే అక్కడ ఉండాలోయ్ అని సర్ది చెప్పేవారు. చివరకు విసిగి పోయిన ఆ కుర్రవాడు "సార్ మీకు కూడా చెప్పకుండా నేను అక్కడినుండి వెళ్ళిపోయి రిక్షా త్రొక్కైనా బ్రతుకుతాను" అని మొండికేశాడు. "మన పుస్తకాలు ఏవి ప్రెస్ కిచ్చినా ఆరు నెలలు, సంవత్సరానికి గాని బయటికి రావడంలేదు. మనం ప్రెస్ పెడదాం" అని ఆ విద్యార్థి నలభై వేలు, శ్రీమాష్టరుగారు ముప్పై వేలు పెట్టి ప్రింటింగ్ ప్రెస్ ఒంగోలులో పెట్టారు. ప్రభుత్వ ఉపాధి పథకం క్రింద ప్రెస్‌లో పని నేర్చుకునే వారికి నెలకు మూడు వందల రూపాయలు ఇచ్చేవారు. నలుగురైదుగురు సాయి భక్తులు శ్రీమాష్టరుగారి ప్రెస్‌లో పని నేర్చుకునే వారు. పని నేర్పించే అతనికి రోజుకు డెబ్భై రూపాయలు ఇచ్చేవారు. ఈ ప్రెస్ పెట్టిన కుర్రాడి తండ్రికి పక్షవాతం వచ్చి మంచాన పడ్డాడు. ఈ కుర్రవాడు వాళ్ళ నాన్నకి ఒక్కడే కొమారుడైనందున తల్లి లేనందున వాళ్ళనాన్న గారికి సేవ చేసేందుకు వెళ్ళి పోతుంటే ప్రెస్ అమ్మేసి వెళ్ళమన్నారు శ్రీమాష్టరుగారు. మూడు నెలల క్రిందట డెబ్భై వేలు పెట్టి ప్రెస్ పెడితే, ఇప్పుడు అమ్మాలంటే ముప్పై వేలు, నలభై వేలు అయితే కొంటామంటున్నారు. అంత నష్టానికి అమ్మలేక ఆ కుర్రాడు వెళ్ళి పోయాడు. అప్పుడు విక్రంగారికి ప్రెస్ నిర్వహణ ఒప్ప చెప్పారు. ఒక ఆరు నెలలు ప్రెస్ జరగడం కష్టమైంది గాని ఆ తర్వాత శ్రీమాష్టరుగారి ప్రెస్ మూడు షిప్టులు పనిచేయ సాగింది. ఒంగోలులోని ఇతర ప్రెస్‌లన్నీ పనిలేకుండా బీడు పడ్డాయి. శ్రీమాష్టరుగారి ప్రెస్‌లో కనక వర్షం కురవసాగింది. ప్రెస్సే శ్రీమాష్టరుగారికి జీవనోపాధి అయింది.

ఈ ప్రెస్సును శ్రీమాష్టరుగారి కొరకు సాయినాథుడు ఏర్పాటు చేశారు. శ్రీమాష్టరుగారికి ఇంక ఆరు నెలలకు ఉద్యోగం పోతుందని తెలిసిన సాయి ముందుగానే ప్రెస్ ఏర్పాటు చేశారు.



ప్రెస్ పెట్టిన కుర్రవాడు సారాయి అంగడిలో ఉండలేనంటే శ్రీమాష్టరుగారిలా వెంటనే స్పందించి ఇతరుల కొరకు అప్పుచేశారు. మనం అలా చేయగలమా? ఏమో నేను మాత్రం చేయలేను. ఇతరులకు సహాయపడడమే శ్రీమాష్టరుగారి ధ్యేయం. అదే సాయి వారికి నేర్పిన విద్య. ఆపదలో ఉండే వారికి సహాయ మందించ లేకుంటే  మన ఆధ్యాత్మిక సాధనంతా బూడిదలో పోసిన పన్నీరే అని పదే పదే చెప్పేవారు. తన గడప త్రొక్కి తనను సహాయమర్ధించిన వారందరికి తన శక్తికి మించి సహాయం చేశారు. అలా చేయలేనప్పుడు చేయగల వారి దగ్గరకు పంపారు. అందరినీ ఆదుకునేది ఆ సాయినాథుడే అని చెప్పేవారు.

నిష్ట, సబూరి**:-**నిష్ట, సబూరి అని తాటికాయంత అక్షరాలు మందిరాలలోను ఇండ్లలోను వ్రాసుకోవడం కాదు. శ్రీ మాష్టారి ఆచరణే వారి సబూరీకి పరాకాష్ట.

**1983** సం.లో అమ్మగారు మంచమెక్కారు. **1989** సం. శ్రీమాష్టరు సమాధి చెందినంతవరకు ఒక్క రోజైన నడవ లేదు. ఇప్పటికీ నడవలేరు. శ్రీమాష్టరుగారు ఏనాడు ఆమె అనారోగ్యాన్ని గూర్చి బాధపడి ఎరుగరు. సాయిని ప్రార్థించీ ఎరుగరు. నేనైతే ఎన్ని మ్రొక్కులు మ్రొక్కి ఎన్ని ప్రార్థనలు చేసి ఉందునో. ఆత్మీయులు కండి, అతిథులు కాకండి అని తన దగ్గర కొచ్చిన వారికంతా చెప్పటమే గాక తాను ఆచరించి చూపిన మహనీయుడు.

# సాయి తనకు చేసిన ఉపకారాలు

ఎందుకు సార్ ఆన్నానికి కరువుచేసిన ఈ సాయి ప్రచారం అని నేనంటే సాయి నాకేమి తక్కువచేశాడు సుబ్బరామయ్యా. విద్యానగరులో ఫ్యాన్లు లేవు ఇక్కడ ఎన్ని ఫ్యానులో చూడు. విద్యానగర్‌లో నీళ్ళు చేదుకోవాలి.  ఇక్కడ ఎన్ని కుళాయిలున్నాయో చూడు. విద్యానగర్‌లో ఫోన్ లేదు. ఇక్కడ ప్రక్కన్నే ఫోను. ఎక్కడికి పోవాలన్నా క్రిక్కిరిసిన బస్సెక్కి గూడూరు కొచ్చి అక్కడ రైలెక్కాలి. ఇక్కడ రైలు స్టేషనులోని మిత్రులు రైలు వచ్చేటప్పుడు ఫోన్ చేస్తారు. T.C కి చెప్పి బెర్త్ ఇప్పిస్తారు. ఇంటి దగ్గరికే కూరలమ్మువారు వస్తారు. అన్నమంటావా ఏ

రోజు మనం అన్నం తినలేదు. కొంచెం వెనుకముందు అంతే. ఇంటికి చుట్టాలొస్తే ముందు వాళ్ళకు పెట్టి తర్వాత గదా మనం వండుకొని తింటాము. సాయి స్మరణవలన నాకు సర్వము లభిస్తుంది. నాకేది తక్కువ కాలేదని సంపూర్ణంగా తృప్తిని వ్యక్తపరిచేవారు. వారికి ఏ సమస్య లేదని అనుకుందామా అంటే బోలెడున్నాయి. జీవితమనే బండిని తృప్తిగా నడిపిస్తూ సాయిని మెప్పించారు. "వాడు నా బిడ్డలాంటి వాడు నేను తండ్రి లాంటి వాడిని" అని సాయి చేతనే మెప్పు పొందారు. మనలను కూడా వారిలాగ చేసి సాయి కృపను సంపూర్ణంగా పొందమని అచరణతో చూపారు.

సద్గ్రంథాలు చదువు, పోటీలు, పంతులు, కీచులాటలూ మానితే దేవుడు కాపాడుతాడు. అన్న సాయి వాక్యాన్ని తానాచరించినందుకు నిదర్శనంగా 'విజ్ఞాన వీచికలే' గాక శ్రీమాష్టరుగారు వ్రాసిన ప్రతి గ్రంథంలోను ఎన్నో గ్రంథాలలోని విషయాలు ఉటంకించారు. సత్ సంగాన్ని ఒక ఆయుధంగా మన రాష్ట్రంలోనే గాక ఇతర రాష్ట్రాలలోగూడా సత్ సంగాలను ఏర్పాటుచేశారు. ఈ సత్ సంగాల ద్వారా మేలు పొందిన భక్తులు ఇందరని చెప్పవీలుకాదు. సత్ సంగము, భజన అనే గ్రంథాన్ని ప్రచురించారు. సత్ సంగమంటే తెలియని వారు కుడా ఈ గ్రంథం చదివి సత్సంగాలు నిర్వహిస్తున్నారు. ఎంతో మేలు పొందుతున్నారు.

ప్రతి పనిలోను మేలు, కీడు ఉన్నట్లు కొన్ని చోట్ల పోటీ భావాలు, పంతులు, కీచులాటలు రావడం సహజమై పోయింది. అందరిలో సాయిని చూడడం అలవాటైతే ఈ పోటీ భావాలు, కీచులాటలకే తావు ఉండదు. ఇష్టాయిష్టాలు పోగొట్టుకోవడమే సాధనా రహస్యమని ఎరుగడమే ఈ జాడ్యానికి మందు అంటారు శ్రీమాష్టరుగారు .

గురువు కావాలనే గుబులు పుట్టకుండా ఉండుగాక సాయి అన్ని సమయాలలోను

"నేను అల్లాకు బానిసను."

"అల్లా అచ్ఛా కరేగా"

"ఓ అల్లా వర్షమిక చాలించు" అన్నారే కానీ నేను గొప్పసిద్ధ పురుషుడిని అని ఏ నాడు ప్రకటించలేదు. నేడు వీధి కొక గురువు ఇంటికొక గురువూ



తయారవుతున్నారు. నేను శక్తి పాత మిచ్చి మీకు ఆత్మ జ్ఞానమిస్తాను అనే ప్రబుద్ధులు కొందరు. నేను గురుస్వామిని అని ప్రకటించుకొనే వారు మరి కొందరు. శ్రీమాష్టరుగారు సమాధి చెందే వరకు "గురు భరద్వాజ్" అనే మాట ఎవరన్నా, ఇక ఆరోజంతా అలా అన్న వాళ్ళకు అక్షింతలు వేయడంతో సరిపోయేది. సాయినాథుని ముందు మనం గురువు అనే బిరుదు తగిలించు కోవాలంటే మనకెన్ని గుండెలుండాలి? విశ్వానికంతా ఆధిపత్యము వహించిన సాయినాధుడే నేను గురువునని చెప్పలేదే ఆ మహనీయుడు ఉండగా మనమెంత? మన సామర్థ్యమెంత? అని చెప్పేవారే గానీ, ఎవరు తనను గురువు అని సంబోధించినా అంగీకరించక వారికి తిట్ల వర్షం కురిపించేవారు.

అ మహనీయుడు చూపిన శుభ్రమార్గంలో పోవలసిందిపోయి వక్రబుద్ధులు పుట్టడం ఎంత దురదృష్టమోకదా!

# వారు చెప్పిందొకటి నేడు మనం చేసేదొకటి

"నా దర్బారు అన్ని వేళలా తెరిచే ఉంటుంది" అన్న సాయి వాక్యాన్ని ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఎంతమంది శ్రీమాష్టరుగారితో విభేదించినా ఆచరించి చూపిన మహనీయుడు. వచ్చిన భక్తులకు వెంటనే మనం కనబడకూడదు. విజిటింగ్కార్డు పద్ధతి పెట్టాలని ఎందరో మొత్తుకొన్నారు. దానికి ససేమిరా వారు అంగీకరించనందున విభేదించి క్రొత్త పార్టీ స్థాపించారు. సాయినాథునికి లేని ఈ పద్ధతులు మన కెందుకు. మనం సాయి సేవకులంగదా, మన కొరకు సాయి విజటర్స్ రూపంలో వస్తే విజిటింగ్ కార్డులు పెట్టి మనం మూల కూర్చోవడం తగదు అని విజిటింగ్ కార్డులు టైం అపాయింట్మెంటుకు అంగీకరించలేదు. కాని శ్రీమాష్టరుగారు సాయి మాటనే చివరి వరకు పాటించారు. సేలం నుండి రాత్రి 3 గం॥ సమయంలో వచ్చిన అయోధ్యగారిని నిశ్శబ్ధముగా పడుకోమంటున్నారు, అక్కడున్న శ్రీమాష్టారి భక్తులు. వీళ్ళ మాటల శబ్ధానికే శ్రీమాష్టరు తలుపు తీసి బయటకొచ్చి శ్రీ అయోధ్య గారిని పలకరించి వారి స్వప్న వృత్తాంతం విని "అలాంటివేవి పట్టించుకోవద్దు. పడుకో"మన్నారు. అటు తరువాత కొన్ని గంటలలోనే మహా సమాధి చెందారు.

# సాయి మందిరం

శ్రీ సాయి మందిరాలు ఎలా వుండాలి, ఎలా నిర్వహించాలి అనే విషయమై తెల్లవారి శంఖు స్థాపన అనగా నాటి రాత్రి మూడు గంటల వరకు కలిచేడు మందిర నిర్మాణాన్ని గూర్చి చెప్పారు. నేడు సాయి మందిరాలన్నీ చాలా జుగుప్సాకరంగా ఉన్నాయి. ఎందుకు పనికిరాని వస్తువులు మందిరంలో పెట్టి వాటి సంరక్షణ కొరకు తలుపులు తాళం వేస్తున్నాము. "నా దర్బారు అన్ని వేళలా తెరిచే ఉంటుంద"న్న సాయి మాట మనమేమి పాటిస్తున్నాము. నిర్మించబోయే కలిచేడు సాయి మందిరంలో చిత్రపటం తప్ప ఇతర ఏ వస్తువులు ఉండకూడదు. చిత్ర పటం చుట్టూరా గోడలలోనే గూళ్ళు పెట్టించి వాటిలో నూనె దీపాలు పెట్టండి. అదీ పండుగలప్పుడు మాత్రమే అలా పెడుతాము. మిగిలినప్పుడు ఒక్క కరెంటు బల్బు సరిపోతుంది. మందిరానికి గ్రిల్స్ తలుపు పెట్టండి. ఏ వేళలో ఎవరికి ఆపద వచ్చినా వారిని దర్శించుకొని తమ బాధలు నివేదించుకొనేటట్లుండాలి. మందిరంలో ఇంక ఎలాంటి ఆభరణాలు, అలంకరణలు, విలువగల వస్తువులూ లేకుంటే తాళాలు వేయవలసిన పని ఉండదుగదా.

అక్కడ మనం నియమించే పూజారి అన్ని పనులు చేయ గలగిన కుర్రాడుగా ఉండాలి. కరెంటు పని, హోమియో మందులివ్వడం, పూజాదికములు శ్రద్ధతో నిర్వహించడం, పిల్లలకు చదువు చెప్పడం, వంట చేయడం, పెండ్లి మంత్రాలు, తద్దినం మంత్రాలు చెప్పగలగడం, ఈపని నాకు చేతగాదు అనే మాట అనని వాణ్ణి పంపమని సాయిని ప్రార్థిస్తే వారే పంపుతారు. అలాంటి వర్కర్లు ఉంటే పది సంవత్సరములలో ఆ ప్రాంతమంతా భక్తి వెదజల్లబడి ఫలమంతమౌతుంది. నేడు క్రిష్టియన్లు అవలంభించే పద్ధతే ఇది. “ఆచరించేటందుకు మనం రెడీగా ఉంటే సాయి తన కార్యం చక్కగా నెరవేర్చుకుంటారు." అని మాకు బోధించారు. కానీ పెద్దలని విర్రవీగే మహనీయులు “ఆయనకేం ఆయన పలావు లిస్టు చెపుతుంటాడులే" అని వారి సలహాలు బుట్ట దాఖలు చేశారు.

విద్యానగర్ సాయి మందిర ద్వారానికి షట్టర్సు మధ్యన అడ్డంగా ఒక సందు పెట్టించారు. ఏటైంలోనైనా ఎవరైనా సాయిని దర్శించుకొని తన కష్టాలు



నివేదించుకో గలగాలనేదే వారి ఆశయం. క్రమేణా అన్ని హంగులు ఏర్పడ్డాక ప్రహరీగోడలు పెట్టి మెయిన్ గేటుకే తాళాలు ప్రతిమందిరంలో పెడుతున్నాము. వారు చెప్పేదొకటి మనం చేసేది మరొకటి. మనం ఇష్టాయిష్టాలు వదలి గురు వాజ్ఞను పాటించేదెప్పుడో! వారి సంపూర్ణకృప పొందేదెప్పుడో గదా!

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి సమాధి మందిరం కట్టేటప్పుడు శ్రీ వెంకయ్యస్వామి హ్యూమేనిటేరియన్ మిషనుకు శ్రీ భరద్వాజమాష్టరుగారు ప్రెసిడెంటుగా ఉన్నారు. శ్రీ స్వామి వారి నమాధి మందిరానికి గ్రిల్స్ తలుపులే పెట్టించారు. ఆవి ఈనాటికి ఆలాగే వున్నాయి. అయితే కాలాంతరంలో ప్రహరీ గోడలు, మెయిన్ గేట్లు వచ్చి ఎవ్వరూ లోపలికి పోకుండా చేశారు. ఎందుకు? మందిరంలో బంగారు నామాలు ఎప్పుడూ పటాలకి ఉంటాయి. ప్రతి శనివారము అలంకరించేందుకు బంగారు నగలున్నాయి. ఇతర ఇత్తడి, స్టీలు పాత్ర సమానులు బోలెడుంది. ఇవిగాక పట్టు వస్త్రాలు సిల్క్ వస్త్రాలు వీటిని సంరక్షించుకొనేందుకు గేట్లు, తాళాలు, వాచ్‌మన్‌లు వచ్చారు. ఈ వెండి, బంగారు, పట్టు వస్త్రాలు లేనప్పుడు శ్రీ స్వామి వారు తన్నాశ్రయించిన వారి బాధలు తీర్చ లేదా? వారికి అలంకరణలు వస్తు సామాగ్రి అక్కరలేదు. తన అవతార కార్యమొక్కటే కావాలి. వారు కోరిన కాలము, మనస్సు సమర్పించిన ప్రతి వారిని ఆదుకొంటున్నారు. ఆకలితో అలమటించే వారికి పట్టెడన్నం పెట్టలేని బంగారు, అలంకారాలు శ్రీ స్వామి వారు కోరుతారా? జీవితాంతము సాయి గాని శ్రీ స్వామి వారు గాని అన్ని జీవులు తృప్తిగా భోంచేశాకనే తిన్నారు. ఆకలికి అలమటించే ఆడపిల్లను తన ఇంట్లో పెట్టుకొనేందుకు అంగీకరించి తాను తినే అన్నంలో సగం ఆమెకు పెడతానన్న త్యాగమూర్తి, శ్రీ మాష్టరుగారు. అలాంటి త్యాగమే వారిని సాయి బిడ్డను చేసింది.

# నా శిష్యుడనేవాడెవరూలేరు

"మనందరమూ అప్పుడప్పుడూ కలుసుకొని ఒకరి భావాలు మరొకరికి చెప్పుకోవాలి. మనలోని దోషాలను సవరించుకోవాలి. మన సాధన పటిష్టం

చేసుకోవాలని" చెపుతూ విజయదశమి, గురుపూర్ణిమ, శ్రీరామ నవమి, దత్తజయంతి, శ్రీమాష్టారి పుట్టిన రోజు పండుగలను ఏ ఆడంబరాలు, అలంకరణలు మైకులు లేకుండా ఎంతో నిరాడంబరంగా జరిపేవారు.

ఎంతో దూరప్రదేశాలనుండి వచ్చిన భక్తులు రెండు మూడు రోజులు వారి దివ్య సన్నిధిలో ఉండి వారి దివ్య ఉపదేశాలు విని తమను రీచార్జి చేసుకొని వెళ్ళేవారు.

ఈనాడు మనమూ సమ్మేళనాలను ఆ విధంగా రీచార్జి కేంద్రాలుగా చేసుకోవాలి. మనందరమూ ధర్మప్రచారుకులుగా భాసించాలని, ఆ విధంగా సాయి ధర్మాన్ని మనముండే చోట వ్యాప్తి చేయాలని వారి ఆశయము. ఈ ఆశయం నెరవేరందుకు సత్‌సంగము సాధనమని చెప్పి వారు సత్‌సంగాలు ఏర్పాటు చేసి ఒక్కొక్క సత్‌సంగ దీపము కోటి దీపాలు వెలిగించాలని ఆశించారు. నేడు మనం పోటీలూ, వంతులు, కీచులాటలలో పడి వారి దివ్య ఆశయాన్ని మరచి పోతున్నాము. సాధనలోని విడరాని ముడులు విప్పేందుకు సమ్మేళనపు వేదిక ఉపయోగించుకొందాము. సాధనలోని మీ ఇబ్బందులు ఒక కాగితం మీద వ్రాసి మీ అడ్రస్సు క్లియర్‌గా వ్రాసివ్వండి. ఎవరిద్వారానైనా శ్రీమాష్టరుగారు మన ఇబ్బందులు తప్పక తీరుస్తారు. మన డౌట్స్ క్లియర్ చేసి తీరుతారు. పనిపిల్ల ద్వారా దాసగణుకు సంశయము నివారించినట్లు చేసి తీరుతారు.

మూడు, నాలుగు క్లాసుల విద్యార్థులకు ప్రతి రోజు కొంతసేపు పాఠాలు చెప్పేవారు. తన సహాయం కోరి అప్పు అడిగినవారు, పాఠాలు చెప్పమన్న వారు, బిచ్చగాళ్ళు అందరూ వారి దృష్టికి సాయినాథులవలె కన్పించేవారు. మా స్కూలు నుండి వచ్చిన పది పన్నెండేళ్ళ చిన్న పిల్లలతో సాయంకాలం **$6^1/_2$** గం॥ నుండి $9^1/_2$ గం॥ వరకు ఎంతో ఆసక్తితో కుతూహలంగా మాట్లాడుతూనే ఉన్నారు. ఆ చిన్నారులకు అంత ఆసక్తికరమైన విషయాలు ఏమి చెప్పారోగాని ఆ మహనీయుని వదలి అన్నానికి కూడా రాలేక పోయారు.

అందరినీ సాయి రూపాలుగానే ప్రేమించారు, లాలించారు అందుకే ప్రతి శ్వాసలోను సాయిని నింపుకున్న మహనీయుడై సాయిచేతనే "నా బిడ్డలాంటి వాడు నేను వానికి తండ్రిలాంటి వాడను." అని అనిపించుకున్నారు. అలాంటి



దివ్య ప్రేమను అలవాటు చేసుకోమని వారి ఆచరణతో మనందరికీ బోధించారు. వారాచరించి చూపిన దివ్యమార్గం మరచి నేడు మనం వంతులు, పోటీలు, కీచులాటలలో తగుల్కొని వారాచరించి చూపిన మార్గం వదలి ఎక్కడికి పోతున్నామో, మన గమ్యమేదో, సాధన ఏదో తెలియని స్థితిలో ఉన్నాము.

నా శిష్యుడని చెప్పుకోదగ్గ వాడొక్కడు లేడు. నేను నా గురువును సేవించినట్లు సేవించే వారెవరూ లేరు. నేను నా యావజ్జీవ శక్తిని నా కండ్లలో పెట్టుకొని నా గురు రూపాన్నే అన్నపానీయాలుగా త్రాగాను. వారిని చూస్తుంటే నాకు ఆకలి దప్పులు తెలిసేవి గావు అని సాయి చెప్పారు.

సాయి వారి గురువును సేవించిన దానికంటే ఎక్కువగానే శ్రీమాష్టరుగారు సాయిని సేవించారు. ప్రతి మనిషిని తన గురువుగానే భావించారు. తన జీవితంలో ప్రతి అడుగు వేయిస్తుంటే వేస్తున్నానని త్రికరణ శుద్ధిగా తలచారు. వారి ఆజ్ఞల ప్రకారము నడవాలంటే ఇష్టము, అయిష్టము లేకుండా జీవించడమెలాగో నేర్చుకున్నారు. రాగ ద్వేషముల జాడే లేకుండా వాటిని తనలోనుండి సమూలంగా నిర్మూలించుకున్నారు. ప్రతి చిన్న విషయములోనూ గురువు మీద ఆధారపడు. అదే అసలైన సాధన అన్న మాటను ఆచరించి చూపారు.

వివాహము చేసుకోవాలా వద్దా అనే సంశయం కలిగినప్పుడు దీక్షచేసి వారినుండి చేసుకోమనే సమాధానం పొందారు. షిరిడీకి పోవాలా, ఇంటర్వ్యూకి పోవాలా అన్నప్పుడు దీక్షకు టైంలేదు గనుక చీట్లు వేశారు. వారి ఆజ్ఞ ప్రకారం షిరిడీ వెళ్ళారు. ఈ వచ్చిన సన్యాసి రూపంలో కూడా నీవే ఉండేటట్లయితే ఈ సన్యాసి ఆరణాల దక్షిణ అడగాలి అనుకోగానే అతను ఖచ్చితంగా ఆరణాలే అడుగుతారు. విద్యానగర్ వదలి వెళ్ళమంటారా, ఉండమంటారా అనే మీ నిర్ణయం ఈ రూములోకి అరగంటలోగా ఎవరొస్తే వాళ్ళ సలహా ద్వారా చెప్పండి అని అనుకుంటే అనంతపూర్ భక్తుని తీసుకొని వచ్చి " ఎక్కడికో వెళ్ళే టట్లున్నారు ఇవి తీసుకొని పొమ్మంటూ పూలు పండ్లు తెచ్చి సమర్పించిన క్రొత్త పరిచయస్తుడే తనకు సాయి రూపంగా భావించారు.

ముఖ పరిచయం కూడాలేని ఎంతో మంది వచ్చి జీవనోపాధి లేదని అడిగితే రెండు వేలుగానీ, మూడు వేలుగానీ ఇచ్చి ఏదో ఒక వ్యాపారం చేసుకోమని చెప్పేవారు. ఆ డబ్బు తిరిగి ఇచ్చిన వాళ్ళు చాలా కొద్ది మంది మాత్రమే.

తన గడప త్రొక్కిన మనుషలకే కాదు, ఋణానుబంధాన్ని విశ్వసించి ఎద్దులను, కుక్కలను, చివరకు నాగుపాములను గూడా సాయిగానే భావించారు. క్రొత్తపాలెం రామిరెడ్డి గోపాల్‌రెడ్డి గారి ఎద్దు తప్పించుకొని క్రొత్తపాళెం నుండి షుమారు **5** కి॥ మీ॥ దూరం పరుగెత్తి విద్యానగర్ చివర ఉన్న మాష్టరుగారి సత్‌సంగం హాలు కడపదాటి ముందు కాళ్ళు హాలులో పెట్టి రొప్పుతుంది. ఆ క్షణంలో ఆ ఎద్దు వారికి ఎలా కన్పించిందో కాని బక్కెట్టునిండా నీళ్ళు పెట్టి త్రాగనిస్తూ దానిముఖానికి పసుపు కుంకుమ అలంకరించి దానినోటికి అరటి పండ్లు అందించారు. ఈ దృశ్యం చూచిన వారు శ్రీమాష్టారికి పిచ్చి ముదిరిందనుకొన్నారు. ఇంట్లోకి వచ్చిన ఎద్దును కర్రతో తరమాలిగాని ఇదేంటి ఈ మర్యాదలు చేయడం అని చెప్పుకొన్నారు. అదివారి పిచ్చి. ఇది వీరి పిచ్చి. ఇది చదివి మన పిచ్చి ఎలాంటిదో మనమే నిర్ణయించుకోవాలి.

బాతు రూమ్‌లో కుక్క ఈనితే "కుక్క ప్రసవించింది నరసమ్మా, దానికి అన్నం పెడుతున్నాను" అని పెరుగన్నం కలిపి దాని నోటికందించి దాని మూతి తుడిచి దుప్పటి కప్పిన మహనీయుడు. జంతువులకు వాడే "ఈనడం" అనే మాట కాకుండా మనుషులకు వాడే మాట ప్రసవించడం అంటున్నారు.

తను కూర్చునే ప్రక్కరూమ్‌లో నాగుపాము కుబుసం వదలిపోతే **'కిం'** అనకుండా ఆకుబుసాన్ని అందరికీ చూపిన సర్వ హృదయాంతర్వర్తి.

గొలగమూడిలో రోడ్డుకడ్డం వస్తున్న తేలును తన చేత్తో కంపలోకి తోసి దానిని చంపకుండా రక్షించిన కరుణామూర్తి.

విద్యానగర్‌లో ద్వారబంధానికి చేయి ఆనించి నిలుచున్న శ్రీమాష్టారి చేతి ప్రక్కనున్న తేలును చంపకుండా దూరంగా పారవేయించిన దయామయుడు.

ఈవిధంగా అన్ని జీవులలోను సాయిని చూచి అలాంటి ఆచరణ నేర్చుకోమని మనలను ప్రబోధించిన మహనీయుడు శ్రీమాష్టర్. ఋణానుబంధాన్ని విశ్వసించు అనే మాట వ్రాతలోకాదు చేతలలో ఉండాలని ప్రబోధిస్తున్నారు.

# అతిథులు, ఆత్మీయులు

మన ఇంటి గడపలో ఉన్న కుక్క ఒక అతిథి. అది ఒక రొట్టె ముక్కతో వెళ్ళి పోతుంది. మనింటికి వచ్చిన బిచ్చగాడొక అతిథి. పిడికెడు బియ్యంగానీ,



మెతుకులుగానీ పెడితే వెళ్ళి పోతాడు. స్నేహితుడొస్తే ఒక కప్పు కాఫీతో వెళుతాడు. ఒక చుట్టమొస్తే ఒక పూట భోజనంతో వెళుతాడు. మరి జీవితాంతం మనలను కనిపెట్టుకొని సేవచేసే భార్యకుగాని, బిడ్డలకుగానీ ఏమీ ఇవ్వము. అది చేయలేదు, ఇది చేయలేదు అని నాలుగు అక్షింతలు మాత్రమే వేస్తుంటాము. కానీ చివరకు మన ఆస్తంతా భార్యాబిడ్డలకే గదా! వీళ్ళను ఆత్మీయులంటారు. అదే విధంగా మనం వారు విశ్వ వ్యాపకుడని, అన్ని జీవులలోనే గాక పంచభూతాల రూపంలో వారే మనలను పోషిస్తున్నారనే ఎరుక ఏమారకుండా ఉంచుకొని, వారిని సేవిస్తుంటే వారు సంప్రీతులౌతారు. ఏ జీవిని ఆదరించినా వారిని ఆదరించినట్లే, ఏ జీవిని తిరస్కరించినా వారిని తిరస్కరించినట్లే అనే ఏమారని ఎరుక ఉంటే వారు సంప్రీతులౌతారు. మనలో నైతిక పరివర్తన ఆశించి ఆ మహనీయుడు మనం అజ్ఞానంతో కోరిన కోరికలు తీరుస్తుంటారు. కోరికలు తీర్చుకోవడమే మన ఆరాధన లక్ష్యం కాదు. అతిథులుగా ఉన్న మనం ఆత్మీయులుగా మారాలి అని శ్రీమాష్టారు తన కెన్ని ఇబ్బందులు కష్టాలు ఉన్నా ఒక్కనాడైనా సాయిని తనకు ఫలానా విషయం కావాలని అడుగకుండా సేవించారు. గనుకనే వారు సాయినాథుని బిడ్డ అయ్యారు. మనందరమూ అలా సాయి నాథుని బిడ్డలమయ్యే విధంగా మన నడవడి ఆరాధన మార్చుకోమని శ్రీమాష్టారు గారు మనకు వారి ఆచరణతో బోధించారు.

**1983** సం॥ నుండి శ్రీమాష్టారు గారు మహా సమాధి చెందే వరకు అమ్మగారు నడువలేకున్నారు. ఇప్పటికీ అలాగే ఉన్నారు. ఒక్కనాడైనా అమ్మగారికి ఆరోగ్యం సరిచేయమని సాయిని వారు అడుగలేదు. ఆమె ఎడల మమకారబంధం అంతగొప్పగా నశింపజేసుకున్నారు. ఉద్యోగం పోయి, ప్రెస్ పెడితే అది జరుగక ప్రతి నిత్యం కిలో బియ్యం కొనే పరిస్థితి వచ్చినా తన ఆర్థిక పరిస్థితి మెరుగు పరచమని శ్రీమాష్టారు గారు సాయిని అడగలేదు. సాయి మనకేమి చేశాడు సార్ అంటే, నాకేమి తక్కువ చేశాడనీ! ఇంట్లో ఫ్యానులు, నీటి కుళాయలు. ప్రక్కింట్లో టెలిఫోను, రైలు స్టేషన్‌లో స్నేహితులు, రైలు స్టేషన్‌కు తీసుక వెళ్ళే కార్లు, మోటారు సైకిళ్ళు, ఇంటి దగ్గరకే అమ్మవచ్చే కూరలు ఇవన్నీ చెప్పేవారు. అన్నీ ఉన్నా బియ్యమేలేవు సార్ అంటే ఏనాడైనా అన్నం తినకుండా ఉన్నామా? కొంచెం వెనుక ముందు అంతేగదా అనేవారు. ఆవిధంగా భగవంతుడు

ఉంచిన పరిస్థితిలో ఉంటూ తృప్తిగా బాబాను సేవించారు. నా పంచకు వచ్చిన వారికి పాయసం పోయడం నావిధి, కర్తవ్యం, నా ధర్మం. ప్రాప్తమున్న వారు పాయసాన్ని జుర్రుకుంటారు లేకుంటే చీమలు ఈగలు వాటి ప్రాప్తాన్ని అనుసరించి తింటాయి అన్న మహనీయుడు. వారిలాగ మనమూ ఆచరిస్తే మనము సాయి బిడ్డలమవుతాము అంటారు.

# శ్రీ మాష్టారి దివ్యబోధ

-G.శివ, స్విట్జర్లాండ్

లౌకిక జీవితం ఆధ్యాత్మిక జీవితం అనే పుస్తకంలో ( పేజి **26** )శ్రీ మాష్టరుగారు ఇలా చెబుతారు.

ఆధ్యాత్మిక జీవితం అంటే ఏమిటి? బ్రతకడమెట్లాగో నేర్చుకోవటం. అంటే తృప్తి, శాంతి, ఆనందం కోసము. గనుక శరీరం ఉన్నంత కాలం తృప్తి, శాంతులతో ఉంటుంది. రాలిపోయిన నాడు తృప్తి, శాంతులతో రాలిపోతుంది. ఆ తరువాత మళ్ళీ జన్మకొచ్చేందుకు ఋణానుబంధాలు కానీ, రాగద్వేషాలు కానీ, మనస్సులో కాపీనాలు కానీ ఏమీ లేవు. జాగ్రత్తగా వినండి! అంతే గానీ ఏదో సాధించాలని అనుకున్నాడంటే ముందు అంతకంటే భ్రమలో పడ్డాడు. ఏం చేయాలి జీవితంలో? ఏమీ లేదు బ్రతకడం నేర్చుకొంటే చాలు. ఆధ్యాత్మికతని మనం మామూలుగా మాట్లాడుకునే భాషలో చెపితే ఇదే!

ధ్యాన యోగ సర్వస్వంలో ( పేజి **23**) దీనినే ఇలా చెప్పారు. ఈ జీవితాన్ని సంతోషంతో గడపడం ఒక కళ. ఒక పరిజ్ఞానం. అందులోని సుళువు, సూత్రం తెలియకపోతే జీవితం భారమౌతుంది. తెలిస్తే ఎంతో తమాషాగా గడుస్తుంది. ఆ తెలిసిన వాడి సాంగత్యముతో ఎన్నో జీవితాలు విద్యుద్దీపాలతో, ట్యూబ్‌లైట్లతో వెలిగే భవంతుల్లా ఒక్కసారిగా కాంతిమయం అవుతాయి.

ఇటు వంటి ఆనందమైన జీవితాన్ని పొందేందుకు శ్రీ మాష్టారు గారు చెప్పినది, ఆయన జీవిత విధానం ద్వారా బోధించినదే శ్రీ మాష్టారు చూపిన సాయి మార్గము.

అటువంటి జీవిత విధానంలో ( మొదటి పేరాలో) శ్రీ మాష్టారు గారు ఈ క్రింది అంశాలు ప్రస్తావించారు.



**1)** సుఖ, శాంతులతో, ఆనందంతో జీవించడం.

**2)** ఋణానుబంధాలు తీర్చుకోవడం.

**3)** రాగ, ద్వేషాలు తొలిగించుకోవడం. ఋణానుబంధాలు క్రొత్తవి తగలించుకోకుండా చూచుకోవడం.

ఈ ఒక్కొక్క అంశము గురించి శ్రీ మాష్టరుగారు ఏవిధంగా చెప్పారో, ఆచరించి అది శ్రీ సాయి మార్గమని అందరికీ బోధించారో చూద్దాము.

**1**. ఆనందమైన జీవితం పొందాలంటే అన్నింటి కంటే ప్రధానమైనది ధర్మము ఆచరించడము. నైతిక విలువతో కూడిన జీవిత విధానమే ధర్మము. శ్రీ సాయి లీలామృతంలో శ్రీ మాష్టరుగారు చెబుతారు. " సామాన్యంగా ఎంతో చిన్నవనిపించే విషయాలే చాలా పెద్దవి. వాటిని చక్కదిద్దుకొని, నిజమైన మానవత్వాన్ని అలవరుచుకోవడమే ధర్మమని, దాన్ని సాధించకనే సాధన ప్రారంభిస్తే ఇహ పరాలు రెండూ చెడతాయనీ ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయి."

మన ధర్మం మన కర్తవ్యంలో శ్రీ మాష్టరుగారు చెబుతారు.

ధర్మం ప్రధానంగా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే, సృష్టి మొత్తానికి మూలమైనటువంటి ప్రతి జీవి అన్నీ జీవులకు ఉపయోగ పడుతూ మాత్రమే తమ జీవితానికి, అర్హత సంపాదించు కుండేటటు వంటి ప్రకృతిలో మనం జీవిస్తూ ఉండేటప్పుడు, మనం కూడా తిరిగి ఆలోచించి జీవించడమే ధర్మము.

ఈ విషయమై పోరుమామిళ్ళలో శ్రీ మాష్టరుగారు ఇచ్చిన ఉపన్యాసంలో " వారి నాన్న గారైన అనంతాచార్యులుగారిని అన్నం బయట పెట్టి (పారేసి) ఎందుకు వేస్ట్ (waste) చేస్తున్నారని ప్రశ్నించగా, వారు సమాధానంగా ప్రకృతిలో ఎంత జరిగితే, ఎంత మంది కృషి చేస్తే, ఆహారం వచ్చిందో, అది తింటున్నందుకు మానవులుగా మనం కనీస ధర్మంగా చేయవలసినదేమిటో వివరంగా చెప్పిన తరువాత ఆ విషయమై శ్రీ మాష్టరుగారు ఇలా అన్నారు. "ఆ రోజు చెప్పిన సమాధానం గుండెలో బరిసలా దిగిపోయి ఈ పూటక్కూడా ఏది తినబోయే ముందైనా సరే అదే గుర్తొస్తుంది. ఇది తింటున్నాము గదా మనం తిరిగి ఏమన్నా ప్రకృతికి గాని, సమాజానికి గానీ ఏమైనా చెయ్యగలుగుతామా?

చెయ్యగలుగుతున్నామా? అని ఏ సమర్ధనా లేకుండా తినటమెట్లా? అని లోపల నాన్న గారి మాటలే జ్ఞాపకం వస్తాయి. ఇది ప్రకృతి వెనకాల ఉండే నైతిక సూత్రం అంటారు.

ఈనాడు మనం ఫ్యాన్లు, రేడియోలు, మోటార్లూ, రైళ్ళూ ఉపయోగించుకోగలుగుతున్నామంటే, ఇటువంటి ఆహారాన్ని తీసుకొన్న మానవుడు సర్వజీవులకు మేలు జరగాలి అనేటటువంటి ప్రీతితోటి, తపన తోటి తగు విజ్ఞానాన్ని ఆర్జించి, కష్టించి, ఇందులో ఒక్కొక్కటి కనుక్కుంటం మూలాన లక్షలాది మానవుల యొక్క జీవితాలు బాగు పడుతున్నాయి. ఎవరో ఒక శాస్త్రజ్ఞుడు విద్యుచ్ఛక్తిని ఒకనాడు కనుక్కొంటే ఈనాడు చూడు దేశ దేశాలలో, గ్రామ గ్రామాలలో ఎంత మంది నీరు తెప్పించుకొని పైర్లు పండించుకొంటున్నామో! ఎన్ని పరిశ్రమలు పెట్టుకొని మన జీవితం బాగు పడుతున్నదో! ఒక మనిషి సాటి మానవజాతి మీద ఉండేటటువంటి ప్రేమతోటి, ఆదరణతోటి, తాను చేసినటువంటి కృషి వల్ల, ఒక్క పని వల్ల ఎన్ని కోటానుకోట్ల జీవరాశి సంతోషపడుతుందో చూడండి! ఆ రోజున పాపం దాని వల్ల వాడికి ఏమీ లాభం ఉండి వుండక పోవచ్చు. కానీ ఈ రోజున ఎంత మంది బాగు పడుతున్నారో చూడండి. అది మనం కనుక్కోలేక పోతేమానే, అంత కృషి మనం చేయలేక పోతేమానే, వాడుకొనే ముందు ఆనాడు అలా వాడు కష్టపడి చెయ్యబట్టి గదా మనం ఈనాడు ఇలా సంతోషిస్తున్నాము అని కృతజ్ఞత అయినా కలిగి ఉండటము మానవత్వం. ఈ మానవత్వం అనే దాని యొక్క పరాకాష్ట ఆధ్యాత్మికత!

అంత నిర్విరామ కృషి చేసి సమాజానికి తన రచనల ద్వారా, ఆచరణ ద్వారా ఎంతో మేలు చేసిన శ్రీ మాష్టరుగారే అలా అంటే ( వారు ఏమైనా తినేప్పుడు ఈ ప్రకృతికి కానీ, సమాజానికి కానీ, ఏమైనా చెయ్య గలుగుతున్నానా? ఏ సమర్థనా లేకుండా తినటమెట్లా అన్పిస్తుంది.) ఇంక నా సంగతేమిటి? ఈ విషయమై, ఇది సాయి చెప్పి, చేసి చూపిన మార్గమని శ్రీ మాష్టరుగారు సాయినాథ ప్రభోదామృతంలో (పేజి **30**) ఇలా వ్రాశారు: " శరీరాన్ని సాటి జీవుల శ్రేయస్సు కొరకు శ్రమింప జేయాలి గాని సోమరిగా వుంచ రాదన్న సూత్రాన్ని కూడా సాయి



పాటించారు. విరామ సమయంలో ఒక బంజరు భూమిని చదును చేసి, త్రవ్వి, పూలమొక్కలు నాటి, నీరు పోసి, పూవులను భక్తులకు ఉచితంగా కోసుకోనిచ్చారు. తర్వాత భక్తులెందరో దర్శనార్థం వస్తుంటే వారికి తనతో సమయం గడిపే అవకాశం కల్పించాలని ఆ కృషిని ఆపి, నిర్ణీత సమయాలలో భిక్షకు మాత్రం వెళ్ళి వచ్చారు. తాను భుజించడం మానిన చివరి రోజుల్లో కూడా తన భిక్షపై ఆధారపడి జీవించే వారి కోసమని విధిగా భిక్ష చేస్తూనే ఉన్నారు. దాదా సాహెబ్ కపర్దే ఒక రోజు  ఆరతికి రాకుండా స్నేహితులకు జాబులు వ్రాస్తూ లోకాభి రామాయణంలో, జనసంసర్గంలో కాలం వృథా చేసినప్పుడు వ్యంగ్యంగా సాయి, " ఇంకా నయం, చేతులు కదిలించే పనైనా చేశావు!" అని దెప్పి పొడిచారు. వీరే ఒకసారి ఆరతికి రాకుండా నిద్ర పోయి వచ్చినప్పుడు వారిని మశీదులో ప్రవేశించనివ్వక బయటనుండే విభూతినిచ్చి పంపేసారు. మనం సాయి అలా త్రిప్పి పంపేలా ప్రవర్తిస్తున్నామో లేక మెచ్చేలా ప్రవర్తిస్తున్నమో గుర్తించడం అవసరం. ఈ విధమైన కృషిలో సాయి చేసి చెప్పిన దానిని మాష్టరుగారు నిరంతర తన కృషి ద్వారా బోధించారు. అద్భుతంగా క్షుణ్ణంగా నిర్వహించిన వారి ఉద్యోగధర్మం ద్వారా ఎన్నో సమస్యలతో బాధ పడే వారెందరికో పరిష్కారాలు చూచించడం తవ శక్తి కొలది వారికి తోడ్పడడం ద్వారా వారికి సాయిని పట్టివ్వడం ద్వారా వాటిని తొలిగించడం, రచనలు, ఉపవ్యాసాలు ద్వారా అసంఖ్యాకమైవ జనులకు మేలు చేయడం వారు చేసి చూపించిన సాయి మార్గము.

ఇక వ్యక్తి గతంగా నిజమైన ఆనందాన్ని పొందడం గూర్చి (తృప్తి, శాంతులు పొందడం) మాష్టరుగారు పోరుమామిళ్ళ స్పీచ్‌లో, మతం ఎందుకు? లో ఇలా చెప్పారు. ప్రపంచంలో అతి ధనిక దేశంలోని పెద్ద ధనికుడి దగ్గర నుండి అతి పేద దేశంలోని అతి పేద వాడి వరకు అందరిని పట్టి పీడించేది ఉన్నదానితో అసంతృప్తి, లేని దేనికోసమో తపన. ఇదే అసలైన దుఃఖము అని బుద్ధుడు చెప్పాడు. ఎప్పటికప్పుడు ఇదిగో ఫలాన పరీక్ష పాసైతే ఫలానా ఉద్యోగం వస్తే పెళ్ళైతే పిల్లలు పుడితే...... తృప్తి కలుగుతుంది అని అనిపిస్తూ పోతూవుందే గానీ, ఎవరికీ ఎప్పటికి ఇంక ఏమీ అక్కరలేదు. తృప్తిగా, ఆనందంగా ఉంది అన్న స్థితి కలుగదు. ఏదో తెలియని వెలితి పట్టి పీడిస్తూ ఉంటుంది. వాడికి తెలిసినా

తెలియక పోయినా ప్రతి వాడు అన్వేషించేది దుఃఖమే లేకుండా ఉండే సుఖాన్ని పొందుదామని. కానీ గాఢనిద్రలో ప్రతి వాడికి ఆ తృప్తి, శాంతులు అనుభవమవుతుంటాయి. గాఢ నిద్రలో ఒకటి లేదన్న కొరత లేదు. ఇంకొకటేదో కావాలన్న తపన లేదు. హాయిగా ఉంటుంది. దానికి కారణం?

సామాన్యంగా మనకు మెలకువలో సుఖం కానీ దుఃఖం కానీ ఆరు ద్వారాల గుండా వస్తాయి (అయిదు ఇంద్రియాలు మరియు మనస్సు). కానీ ఘాఢ నిద్రలో అన్నికట్టుబడి ఉన్నాయి అంటే అది బయటనుండి వచ్చేది కాదన్నమాట అంటే మనలోనే ఉందన్నమాట, కాబట్టి మనం ఎక్కడో ఉందనుకొని అంతఃప్రయత్నాలు చేసి తపించిపోతున్న ఆ ఆనందం, తృప్తిశాంతి మనలోనే ఉన్నాయన్నమాట. (ఇది ఆధ్యాత్మికతలో మొదటి సూత్రం) అయితే అవి మనలోనే ఉంటే మెలకువలో ఎందుకు అనుభవం కాదు అని ఆనందుడు అడిగితే బుద్ధుడు దానికి సమాధానంగా మనిషి ఒక తొట్టివంటి వాడైతే తొట్టిఅడుగు మనలోని తృప్తి, శాంతి అనుకుంటే, తొట్టెలోని నీరు మన మనస్సు. నీరు నిశ్చలంగా ఉన్నప్పుడు అడుగు స్పష్టంగా కనపించినట్లే మనస్సు నిశ్చలంగా ఉన్నప్పుడు మనలోనే ఉన్న తృప్తి,శాంతి అనుభవమవుతాయి. మెలకువలో భావ పరం పరల వల్ల, భావావేశాలవల్ల (నీరు కల్లోలంగా కదలిపోతుంటే తొట్టి అడుగు కనిపించనట్లు) మనలోని తృప్తి శాంతి అనుభవం కావు. కాబట్టి మనస్సును మెలకువలో ఉండి నిశ్చలం చేస్తే వాడు ఏతృప్తి, శాంతులకై తపించిపోయి ఇన్ని ప్రయత్నాలు చేస్తున్నాడో అవి ప్రతివాడికీ అనుభవమౌతాయి. సైకిలు తొక్కడం ఎలా అభ్యాసం చేస్తాడో తనలోని తృప్తి శాంతులను అనుభవిస్తూ వ్యహరించడం అభ్యాసంతో కుదురు తుంది. మనస్సును అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగిస్తాడు.

కానీ ఈమనస్సును నిగ్రహించడమనేది ఎలా? మనస్సుచాలా సున్నితమైనది. ఇష్టమొచ్చినట్లు దాన్ని నిగ్రహించాలని చూస్తే పిచ్చిపట్టే ప్రమాదముంది. నిద్రపట్టని రోగం రావచ్చు. కాబట్టి దానికి బలవంతంగా కాకుండా జాగ్రత్తగా నిగ్రహించాలి. మనకు ఏవిషయంపై ప్రేమ, ఆశ్చర్యం కలుగుతుందో దానిపై మనస్సు నిలిచిపోతుంది. సద్గురువు అటువంటి ప్రేమ, ఆశ్చర్యాలను కలిగిస్తారు. కాబట్టి వారిపై మనస్సు సంతోషంగా నిలిచిపోతుంది.

అందువల్ల రకరకాల విషయాలపై పరిగెత్తే మనస్సును సద్గురువుపై



నిలపడానికి ఆయన మహిమను, తెలుసుకొంటానికి ఆయనచరిత్రపారాయణ, లీలాచింతనము, సత్సంగము, నామజపము, హరతులు, పూజ, ధ్యానము మొదలగులవి అభ్యసిస్తూ వుంటే క్రమంగా చంచలత్వం పోయి నిశ్చలమై మనం కొరుకోనే తృప్తి, శాంతి అనుభవమౌతాయి.

ఈవిషయమై మాష్టరుగారు తనఆచరణద్వారా బోధించారు. పూజ చాలా గంటలసేపు తన్మయత్వంతో బాహ్యాప్రపంచంలో సంబంధం, దాని ఎరుక లేకుండాచేయడం.

ఎన్నో సంవత్సరాలు కృషిచేసి ఎందరివద్దనో ఎన్నోసాయిలీలలు తెలుసుకొని మననం చేసుకొని చరిత్రగా వ్రాయడం.

హారతులు, సత్సంగాలు విధిగాచేయడం ద్వారాఆయాసమయాలలో మనస్సును బాబాపై నిలపడం.

విద్యానగర్ లో ఉండగా రాత్రిళ్ళు (తెల్లవారేదాకా) ధ్యానంలో గడపడం, మొదలగు అన్నీవారు త్రికరణ శుద్ధిగా చేస్తూ నిరంతర సాయిధ్యాసలో ఉంటూ అందరికీ చూపిన సాయి మార్గము. “ఋణానుబంధాలు తీర్చుకోవటం ఋణానుబంధాన్ని విశ్వసించి, గుర్తుంచుకో ఏప్రాణినీ తోలెయ్యవద్దు. నీదగ్గరకు వచ్చిన ప్రాణిని ఆదరించు. ఆకలిగొన్న వారికి అన్నము, గుడ్డలు లేని వారికి గుడ్డలు ఇవ్వు”, అన్న బాబావాక్యాన్ని ఎంతో గొప్పగా ఆచరించారు. తనదగ్గరకు వచ్చిన ప్రతి వ్యక్తితో (ప్రాణులతో) హృదయపూర్వకమైన ప్రేమతో తను చేయగలిగినది చేసి, మనం ఋణ విముక్తులవటం ఎలాగో చేసి చూపించారు. ఎందరికో ఇంట్లో, బయట (మెస్సులో) అన్నం పెట్టించడం వారి బీద విద్యార్థులకు ఫీజు కట్టి చదివించడం అంతేగాక మనం ఆహారం సమృద్ధిగా తింటూ, అన్ని వసతులు అనుభవిస్తూన్నాం గనుక, తక్కిన ప్రాణికోటి కంతటికీ ఋణపడకుండ, ఆఋణం తీర్చుకోవాలంటే సకలజీవులకు హితకరమైన పనులలో నిమగ్నమవ్వాలనీ గంగాప్రవాహంలా తనవద్దకొచ్చే అసంఖ్యాకమైన భక్తులందరి బాధలు విని వారికి బాధలు తగ్గించి ఆదరించిన సాయి తన ఆచరణ ద్వారా బోధించిన సాయిమార్గాన్నే మాష్టరుగారు చెప్పారు.

రాగద్వేషాలు తొలగించుకోవటం. ఋణానుబంధాలు (పాతబాకీలు) తీర్చుకోవడం మాత్రమే చాలదట. కొత్తవి తగిలించుకోకుండా వుండాలట.

అందుకోసం రాగద్వేషాలు (ఇష్టాయిష్టాలు) తొలగించుకోవడం తప్పని సరి. వీటిగురించి సాయినాథ ప్రబోధామృతంలో మాష్టారుగారు ఇలా చెబుతారు శిరిడీలో వారంరోజులుందామని వచ్చిన కాకామహజనీని వెంటనే తిరిగి వెళ్ళమని, వెంటనే వెళ్ళదలచిన ధూమల్‌ను నిలిపి వేయడంలోను సాయి యొక్క బోధనా దక్షత తెలుస్తుంది.

ఇష్టాయిష్టాలు అపారశ్రేయస్సనే భగవత్‌కృపను గూడా మనకు చెందనివ్వని ప్రబలశతృవులు యింటిదొంగలు. వాటినివీడనిదే గురుకృప లభ్యంకాదు. వివేక వైరాగ్యాలు, నిష్ట ఓరిమిలు కుదరవు. కృష్ణుడు చెప్పిన హితాన్ని విననివ్వక కర్ణ దుర్యోధనాదులు ఆత్మనాశనం గావించుకొనేలా చేసినవవే. పూర్వపుణ్యమున సద్గురువు లభించినా మామిడి పూతలా అకాలంలో రాలిపోయేలా చేసేవవే. అందుకే వాటిని నిగ్రహించాలని భగవద్గీత చెబుతుంది. ఆరెంటినీ వీడనిదే సాధనే లేదు, దుఃఖమే గతి.

ఇంతటి అనర్థాన్ని కలిగించే రాగద్వేషాలను తొలగించుకొని చిత్తశుద్ధిని సాధించనిదే సాధనలేదు అన్నారు మాష్టరుగారు. అందువల్లనే మళ్ళీ మళ్ళీ

జారిపడిపోతూ ఉంటామట. దీని గురించే మాష్టరుగారు ప్రబోధామృతంలో (పేజి **4**) భక్తులెక్కువ మంది అటు బుద్ధి శక్తితో తగినంత తీవ్రంగా వివేచించి వివేక వైరాగ్యాలను పటిష్టం చేసుకోరు. ఇటు నిష్కామ కర్మను అహంకార మమకారాలు లేకుండా ఆచరించరు. కనుక చిత్తశుద్ధి తగినంతగా వారిలో ఉండదు. క్రమంగా వారిలోని మలిన సంస్కారాల చేత గురువు పట్ల, ఆయన బోధ పట్ల క్రమంగా శ్రద్ధను కోల్పోతారు. వారి శ్రద్ధ సాధనేతరమైన విషయాల పట్ల రాగ ద్వేషాలపై నిలచి క్రమంగా వారు గురువుకు, గురుబోధకు దూరమవుతారు. కొందరు తమ పొరపాటును గుర్తించక కొంత కాలం తరువాత తాము మరలా మొదటి స్థితిలో గుర్తించ వలసిన ఈ సత్యాన్ని గుర్తించక మరలా బయలుదేరిన చోటికే చేరామని గుర్తించి ఈసారి మరింత నిర్దుష్టంగా గురు సన్నిధిని వినియోగించుకొని కృతార్థులవుతారు.

పేజి **39** లో మన నుండి ఆత్మ శక్తిని మరుగు పరచే దోషాలలో మొదటిది మల దోషమనీ అంటే రాగ, ద్వేష, స్వార్థాది మలాలేనని అవి నిష్కామ కర్మ ద్వారా తప్ప తొలగవని, అటు తర్వాతగాని సాధకుడు మనోచాంచల్య రూపమైన



విక్షేపదోష నివారకమైన ' ఉపాసన' (నిశ్చలమైన ఇష్ట దేవతా ధ్యానము) చేయ జాలరనీ మన ఋషులు చెప్పారు. పై మహనీయులందరూ గత జన్మలలో అంతటి ధ్యానాదుల నభ్యసించి కృతకృత్యులయ్యారని అర్థం చేసుకోవాలి. అలా చేయనందు వల్లనే ఎన్ని లక్షల మంది వారిని దర్శించి వారి బోధలను విన్నా ఏ కొద్దిమందో తప్ప మిగిలిన వారు అలానే ఉండి పోయారు.

ఈవిషయాన్ని వార్తాలాపంలో శ్రీస్వామి నిత్యానంద ఇలా చెప్పారు

"ప్రాణులన్నింటి అంతః కరణమునందును ఉండు మూడుదోషములు మల, విక్షేప, ఆవరణ దోషములు ప్రాణుల దుఃఖములన్నిటికిని కారణములు. ఈమూడు దోషములను పోగొట్టుటచే ముముక్షువులు మోక్ష సుఖమును అనుభవించెదరు. ప్రాణులయందు అనుగ్రహముచే సర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును అగు పరమేశ్వరుడు కర్మ, ఉపాసన, జ్ఞానములతో కూడిన త్రికాండరూపమగు వేదమును రచించెను.......నిష్కామ కర్మచే మానవుడు మలదోషమును నశింపచేసికొనవలెను. ఇహలోకములోను, స్వర్గాది పరలోకములతోను సంబంధము కల విషయసుఖమునకు సంబంధించిన కోరికలను త్యజించి దేవుడు ప్రసన్నుడగుటకు వర్ణాశ్రమధర్మానుసారము శాస్త్ర ప్రతిపాదితములగు కర్మలను చేయుట నిష్కామకర్మ యోగము, ఈనిష్కామకర్మ యోగముచే అంతఃకరణమునందలి మలదోషము (ఇష్టాయిష్టాలు) నివృత్తినిపొంది వైరాగ్యాదిసాధనములు లభించును. తమ, తమ వర్ణాశ్రమములను అనుసరించి చేయు ధర్మానుష్టానరూపమగు తపస్సుచే పరమాత్ముడు సంతోషించును. పరమాత్ముని ప్రసన్నతచే వివేకము, వైరాగ్యము మొదలగు సంపత్తియు వైరాగ్యాది సాధనములును ముముక్షువుకు లభించును. ఈవైరాగ్యము నిష్కామ కర్మము లేనిదే ప్రాప్తించదు. కర్మచే సంసారముతో ప్రాణి బద్ధుడగును. సంసారము నుండి విముక్తిని పొందుటకు నిష్కామకర్మయే ప్రథమ సాధనము."

ఈ విషయాన్ని మాష్టారుగారు ప్రబోధామృతంలో "ఒక వంక ధర్మసూత్రాన్ని గుర్తించి శాంతి ఆనందాల కోసమై సమాజంలోని సాటి జీవులకు శ్రేయస్కరమైన కర్మను సాయి చెప్పినట్లు పనిచెయ్యి" అని, "ఏ పని చేయడానికింగీకరిస్తావో దానిని సంపూర్ణంగా, క్షుణ్ణంగా చెయ్యి" అన్నట్లు ఆచరించాలి. దానికితోడు అట్టి

కర్మ తన ఆరోగ్యానికి, మనోవికాసానికి యెలా అవసరమో తెలుసుకొని ఆచరించాలి. అంతేగాక ప్రతిజీవి సాటి జీవులకు ఉపకరించే రీతిన ప్రకృతిలో యెలా జీవిస్తున్నాయో తెలుసుకొని అట్టి మహాయజ్ఞంగా తన ధర్మాన్ని అనుష్టించాలి. కర్మాచరణ నాగరికత నేర్పిన రాగద్వేష స్వార్థాది వికారాలచేత గాక పైన చెప్పిన అవగాహనతో చేస్తే చిత్తశుద్ధికి కారణమవుతుందని యిటు మన చర్చ, అటు భగవద్గీతాది గ్రంధాలు చెబుతాయి అని వ్రాశారు.

Summary: ఆధ్యాత్మిక జీవితంగానీ, సాయి మార్గం గానీ ఏమిటి? అంటే బ్రతకడ మెట్లాగో నేర్చుకోవటం. అది నేర్చుకుంటే శరీరం ఉన్నంత కాలం తృప్తి, శాంతులతో ఉంటుంది. రాలిపోయిన నాడు తృప్తి, శాంతులతో రాలిపోతుంది. ఆ తరువాత మళ్ళీ జన్మ కొచ్చేందుకు ఋణానుబంధాలు గానీ, రాగద్వేషాలు కానీ, ఏమీ లేవు అని శ్రీ మాష్టరుగారు ( లౌకిక జీవితం ఆధ్యాత్మిక జీవితం పేజి 26) ఒక ఉపన్యాసంలో చెప్పారు. ఇటువంటి జీవితాన్ని తాను ఆచరించి మనకు సాయి మార్గాన్ని చూపించారు. అందులో సుఖ శాంతులతో జీవించాలంటే ధర్మాన్ని ప్రధానాంశంగా గుర్తించి హృదయ పూర్వకంగా సర్వ జీవులకు ఉపయోగపడే, మేలు చేసే పనులు చేస్తూ జీవితాన్ని గడుపుతూ మరోప్రక్క మనో నిగ్రహాన్ని సాధించడం ద్వారా, మనః చాంచల్యాన్ని అరికట్టడం ద్వారా, మనలోనే ఉన్న తృప్తి శాంతులను అనుభవిస్తుండ వచ్చని, దాని కొరకై నిరంతరం మనస్సును ప్రేమ, ఆశ్చర్యం కలిగించే సద్గురువుపై నిలపడం అభ్యసించాలనీ, దానికి సాధనలుగా పారాయణ, పూజ, నామజపం, సత్సంగం, మొదలైనవి నియమబద్ధంగా చేస్తుండాలని చెప్పారు. ఇటు ఋణానుబంధాలు తీర్చుకోటానికి, హృదయ పూర్వకంగా, ప్రేమతో మన చెంతకు చేరిన వారినందరినీ ఆదరించి, వారికి అవసరమైనవి చేస్తుండాలనే. బాబా వాక్యాన్నీ " కాక బలికి సమృద్ధిగా అన్నం యింటి బయట విడిచిరా. వేటిని పిలవ వద్దు, తరమ వద్దు. అలాచేస్తే లక్షల మంది అతిథులను సత్కరించి నట్లవుతుంది." అనే వాక్యాన్నీ పాటించడం ద్వారా కొంత వరకు ఋణ విముక్తులు కమ్మని ఆచరించి చూపించారు. అలాగే రాగద్వేషాలు తొలగనిదే జన్మపరంపరలు (కొత్త ఋణానుబంధాలు తగులుకుంటాయి కాబట్టి) తప్పవని, ఈ జన్మలో దుఃఖం తప్పదని, దానిని తొలగించు కోవటానికి నిష్కామకర్మ చేయాలని ఆచరించి చూపారు. ఈ పై విషయాలన్నింటిలో బాబా ఎలా చేశారో మనకు వివరిస్తూ తానూ ఆ విధంగా ఆచరించి శ్రీ మాష్టారుగారు మనకు శ్రీసాయిమార్గాన్ని చూపించారు.



# అమ్మగారితో సత్‌సంగం

ఏప్రిల్, మే నెలలు **2000** సం॥లో విద్యానగర్ NBKR కాలేజీ ప్రిన్సిపాల్ గారైన గోవిందప్ప గారు, ఒంగోలులో అమ్మగారైన అలివేలు మంగమ్మగారితో సత్‌సంగం చేసినప్పటి కొన్ని విశేషాలు:-

"ఎదుటివారి మనస్సు కష్టపెట్టడం మాష్టరుగారికి ఎప్పుడూ ఇష్టం ఉండదు. వారికి మంచిచేసే విషయమైనా సరే నొచ్చుకోకుండా చెప్పడం మాష్టరుగారి ప్రత్యేకత యంటారు"- అమ్మగారు.

“ఏ పనైనా నామస్మరణ చేస్తూ చేయాలని మాష్టరుగారు చెప్పేవారు. వంట విషయములోను అంతే. ఎప్పుడైనా వేరే ఆలోచనలలో నామస్మరణ లేకుండా వంట చేస్తే ఆ రోజు మాష్టరుగారికి కడుపులో బాగుండక భోంచేయాలని అనిపించదు అనేవారు. అయితే ఈ విషయము అమ్మగారితో నేరుగా చెప్పరు. సత్‌సంగ రూపంలో సరిదిద్దుకొనేటట్లు తెలియ జేస్తారు మాష్టరుగారు.” అంటారు అమ్మగారు.

ఇట్లా చెప్పుకుంటూ పోతే ఎన్నో విషయాలలో మాష్టరుగారు ఇతర గురువులు, మహనీయుల కంటే ప్రత్యేకమూ, సులభమైన సాధనామార్గాలేర్పరిచి భక్తుల ననుగ్రహించారని నిర్ణయించవచ్చు అంటూ, అమ్మా! మీరు ఏవైనా చక్కటి ఆధ్యాత్మ విషయాలు చెప్తారనుకుంటే నా చేత ఎక్కువ మాట్లాడిస్తున్నారే! అమ్మా! నాకొక సందేహం. ఇతరులు కొందరు గూడా నాతో వ్యక్తపరిచారు అదేమిటంటే "మాష్టరుగారు సమాధి చెందారుగదా! మీరింకా నుదిటిపై బొట్టు, చేతులకు గాజులు ధరిస్తున్నారు గదా! మన సంస్కృతి ఆచారాల ప్రకారం అవి ఉండకూడదు గదా! సందేహం నివృత్తి చేయండి"- అన్నాను. అప్పుడు అమ్మగారు చెప్పారు "నా దృష్టిలో మాష్టరుగారు శరీరం చాలించినప్పటికి నేటికి సజీవులే! నాకు అప్పుడు ఎట్లా

దగ్గర ఉన్నారో ఇప్పుడు అట్లే వున్నారు. ఆయనెక్కడికి పోయారు? ఆయన మరణించారని ఫీలింగ్ నాకు లేదు. అందు వల్ల నేను ఎప్పటిలాగా వున్నాను" అని ముగించారు. సరేనమ్మా, నేడు మాష్టరుగారి ఉనికిని గూర్చిన సంఘటనలు, నిదర్శనములు చెప్పండి అని అడిగాను.

అమ్మగారు చెప్పారు **1**. "సాధారణంగా ఎవరైనా మంచాన పడ్డారంటే శరీరము బ్యాక్, సీట్ భాగాలు కందిపోయి కురుపులుగా మారి ఇబ్బంది పెడుతాయి. నేను గత **20** సంవత్సరములుగా కదలలేక నిరంతరము కూర్చొని పడుకొని వున్నా ఎటువంటి కురుపులు రాకుండా ఉండగలందుకు మాష్టరుగారి రక్షణే.

**2**. మాష్టరుగారి అమ్మాయి వేదమ్మ చిన్నతనంలో ఢిల్లీలో శ్రీరావుగారింట్లో వుంటూ చదువుకుంటున్నప్పుడు ఒకనాడు ఇబ్బంది పడితే స్కూల్ నుంచి ఇంటికి చేర్చటంలో తెలుగు వచ్చిన ఆటో డ్రైవర్ రూపంలో సాయం చేసింది మాష్టరుగారు కాక ఇంకెవరు? వేదమ్మకు అవసరమైనప్పుడు కలలో కన్పించి సలహాలిస్తుంటారు మాష్టరుగారు.

**3**. వేదమ్మ పెండ్లి విషయంలోనూ శారీరకంగా కదలలేని నేను సరియైన పెళ్ళి సంబంధాలు వెతకడం తేలికైన పనికాదు. కాని వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు మాష్టరుగారి భక్తురాలు జయమ్మగారే స్వయముగా మాష్టరుగారి ప్రసాదంగా వేదమ్మను వాళ్ళ అబ్బాయికిచ్చి పెండ్లి జరిపించమని అడిగినప్పుడు నేనెట్లా కాదంటాను. వేదమ్మకు ఇంకా పోస్టుగ్రాడ్యుయేషన్ చదవాలని ఉందంటే, మేమే చదివిస్తామని కూడా వారు చెప్పారు. ఈ ఏర్పాట్లన్ని మాష్టరుగారు చేసినవిగాక మరేమిటి?

నాకు ఎప్పడేది అవసరమో అవన్నీ మాష్టరుగారు దగ్గరుండి జరిపిస్తున్నట్లు నాకు ఇప్పటికీ అనుభవమే. మాష్టరుగారు సమాధి చెందక మునుపు ఎట్లా చూస్తున్నారో, ఇప్పుడూ అంతే" అంటూ ముగించారు.

*******



## మా యితర ప్రచురణలు

| S.No | పుస్తకము పేరు | ధర |
|---|---|---|
| **1** | అవధూత లీల - శ్రీ వెంకయ్య స్వామి వారి జీవిత చరిత్ర | **40** |
| **2** | అవధూత బోధామృతం - శ్రీ వారి బోధలు | **15** |
| **3** | శ్రీస్వామి సన్నిధి - శ్రీవారితో వారి సేవకుల అనుభవాలు | **15** |
| **4** | అవధూత లీల (ఇంగ్లీషు) | **30** |
| **5** | భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి (ఇంగ్లీషు) (చిన్నది) | **5** |
| **6** | వార్తాలాపము | **150** |
| **7** | అవధూత లీల (తమిళం) | **50** |
| **8** | శ్రీ వెంకయ్య స్వామి (తమిళం) చిన్నది | **5** |
| **9** | జ్ఞానేశ్వరి భగవద్గీత | **250** |
| **10** | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర | **15** |
| **11** | శ్రీ వెంకయ్య స్వామి పూజ | **1** |
| **12** | వెన్నెల పూలు - శ్రీ వెంకయ్య స్వామి దివ్యత్వం | **1** |
| **13** | సాయి కృప - కలిచేడు భక్తుల అనుభవాలు | **1** |
| **14** | దివ్య లీలలు | **1** |
| **15** | బోధయజ్ఞాయ నమః | **1** |
| **16** | ధర్మమూర్తి | **1** |
| **17** | పిలిచిన పలికే దైవం | **1** |
| **18** | మౌనబోధ | **1** |

ఉచితము

**1)** మాష్టర్ గారి సత్సంగము
**2)** శ్రీ మాష్టారి మంచి మాట
**3)** శ్రీభరద్వాజగారితో భక్తుల అనుభవాలు
**4)** శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ చరిత్ర
**5)** మృత్యువుపై ఘన విజయము
**6)** మన ధర్మము - కర్తవ్యము
**7)** శ్రీశ్రీశ్రీ సుధీంద్ర బాబు గారు
**8)** స్మృతిమాత్ర ప్రసన్నాయ నమః
**9)** స్మృతిరహిత ప్రసన్నాయ నమః
**10)** సర్వ సమర్థుడు
**11)** అమృత వాక్కులు

ప్రతులకు వ్రాయండి:-శ్రీ సాయిమాస్టర్ సేవా ట్రస్టు, గొలగమూడి, నెల్లూరు జిల్లా **524 321**